నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
శుక్రవారం | జనవరి 12, 2024 | www.navatelangana.com

మెడికల్ కళాశాల, ఏరియా ఆస్పత్రి పరిశీలన

నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీతో పాటు ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌ను సంబంధిత అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మెడికల్ విద్యార్థులకు భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విధాలా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఏరియా హాస్పిటల్‌లో ఉన్న సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అధికారులు, వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా, మండల ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



సర్వేను అడ్డుకున్న సర్పంచ్

నవతెలంగాణ - కాసిపేట

కాసిపేట గ్రామ పంచాయతీలోని దుబ్బగూడెం శివారులో సమాచారం లేకుండా సర్వే నిర్వహిస్తున్న సింగరేణి, రెవెన్యూ అధికారులను స్థానిక సర్పంచ్ దరావత్ దేవి అడ్డుకున్నారు. గురువారం సింగరేణి, రెవెన్యూ అధికారులను ఏ విషయంపై సర్వే చేస్తున్నారని ప్రశ్నించగా ఎటువంటి సమాధానం ఇవ్వలేదన్నారు. ఎస్టీ మహిళా సర్పంచ్ అని చులకనగా సమాధానం చెప్పకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని మండి పడ్డారు. ఈ మేరకు తహసీల్దార్‌ను ఫోన్‌లో సంప్రదించగా తనకు సమాచారం లేదని చెప్పారని, కాని సర్వేలో రెవెన్యూ అధికారులు ఉన్నారని ఆమె పేర్కొన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు వివరించారు.



ఎందుకింత రహస్యం..?

- పులుల మృతి కేసులో అటవీ అధికారుల రహస్య విచారణ
- మూడు గ్రామాల నుండి ఎనిమిది మంది అదుపులోకి?
- అందులో ఇద్దరు మైనర్లు
- తమ ఉద్యోగాలు కాపాడుకునేందుకే అమాయక ఆదివాసులను బలి చేస్తున్నారు : సిడాం గణపతి, ఆదివాసీ నాయకుడు

కాగజ్‌నగర్ అటవీ ప్రాంతంలో ఇటీవల మృతి చెందిన రెండు పులుల మంట ఇంకా చల్లారడం లేదు. ఇది జాతీయ, రాష్ట్రస్థాయిలో సంచలనం కలిగించడంతో అటవీ అధికారులు ఈ కేసును ఛేదించేందుకు రాత్రింబవళ్లు కృషి చేస్తున్నారు. కాని ఈ కేసు విచారణను అటవీ అధికారులు రహస్యంగా చేపట్టడమే ఇక్కడ చర్చనీయాంశంగా మారింది. అటవీ ఉన్నతాధికారులు సంఘటనాస్థలానికి, అటవీ కార్యాలయం లోనికి ఇతరులను అనుమతించకుండా విచారణ చేపడుతుండడం పలు అనుమానాలకు తావిస్తోంది.

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ అటవీ డివిజన్ పరిధిలో ఇటీవల రెండు పులుల మధ్య జరిగిన ఆధిపత్య ఘర్షణలో ఒక పులి మృతి చెందినట్లు అధికారులు నిర్ధారించినా, మరో పులి మాత్రం విషప్రయోగం జరగడంతోనే మృతి చెందినట్లు తేలింది. దీంతో మొదటి పులి మృతి కూడా అనుమానాస్పదంగా మారింది. ఈ రెండు పులుల మృతికి ముందు ఒక ఆవు దీనికి దగ్గర్లోనే మృతి చెంది ఉంది. ఈ ఆవుపై గడ్డి మందు చల్లడం, ఈ ఆవును తిన్న పులులు మృత్యువాత పడ్డాయనే అనుమానాలు బలంగా రేకెత్తుతున్నాయి. ఆవు కళేబరంపై గడ్డి మందు చల్లిన వారు ఎవరనే విషయంలో మూడు రోజులుగా అటవీ అధికారులు విచారణ జరుపుతున్నారు. సంఘటనా స్థలానికి కొద్ది దూరంలోనే కాగజ్‌నగర్ మండలం దరిగాం, వాంకిడి మండలం శర్కపల్లి, రెంగరేటి గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల పశువులు నిత్యం మేతకు అటవీ ప్రాంతానికి వెళుతుంటాయి. ఇప్పటి వరకు ఈ మూడు గ్రామాలకు చెందిన పశువులు పదుల సంఖ్యలో పులుల దాడిలో మృతి చెందాయి. దీంతో ఈ గ్రామాలకు చెందిన వారే విషప్రయోగం చేసి ఉంటారనే అనుమానాలను అటవీ అధికారులు వ్యక్తం చేస్తున్నారు.

8 మందిని అదుపులోకి..

వాంకిడి మండలం వెల్గి గ్రామపంచాయతీకి చెందిన రెంగరేటి గ్రామం నుండి నలుగురిని బుధవారం ఉదయమే అటవీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారి బంధువులు తెలిపిన ప్రకారం..కోట జంగు, ఆత్రం జలపతితో పాటు మరో ఇద్దరు మైనర్ల (పశువుల కాపర్ల)ను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ముందుగా వారిని ఆసిఫాబాద్‌కు, అక్కడి నుండి కాగజ్‌నగర్ అటవీ డివిజన్ కార్యాలయానికి తరలించారు. గురువారం ఈ నలుగురి బంధువులు అటవీ డివిజన్ కార్యాలయానికి వచ్చి కార్యాలయం ముందు తమ వారి కోసం వేచి చూశారు. వీరిని విలేకరులు ప్రశ్నించగా తమకే తప్పు తెలియదని, ఇక నుండి తాము అడవిలోకి వెళ్లబోమని పేపర్ రాయించుకుంటామని చెప్పి పిల్లలను తీసుకువెళ్లారని తెలిపారు. తర్వాత మరో ఇద్దరు పెద్దవారిని తీసుకువెళ్లారని తెలిపారు. వీరిని కొట్టి వారితో అబద్దం చెప్పి కేసులు పెడుతున్నారని వారు ఆరోపించారు. వీరితో పాటు శర్కపల్లి, దరిగాం గ్రామాలకు చెందిన మరో నలుగురిని కూడా తీసుకువెళ్లినట్లు తెలిసింది. వీరందరిని గురువారం సంఘటనాస్థలానికి తీసుకువెళ్లి అక్కడ వీరు పులులను హతమార్చేందుకు ఏ విధంగా ప్రయత్నం చేశారో అడిగి తెలుసుకున్నట్లు సమాచారం.



డివిజన్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న ఆదివాసులు



పులుల జాడ కోసం అడవిలో అమర్చిన ఆధునాతన సీసీ కెమెరా

రహస్య విచారణ పట్లే అనుమానాలు

ఈ రెండు పులుల మృతిపై అధికారులు రహస్య విచారణ చేపట్టడమే ఇక్కడ పలు అనుమానాలకు తావిస్తోంది. దరిగాం గ్రామమే అటవీ ప్రాంతంలో ఉంటుంది. ఈ గ్రామం నుండి 6 కిలోమీటర్ల దూరంలో, అడవిలో పులులు మృతి చెందాయి. సంఘటనాస్థలానికి వెళ్లేందుకు మొదటి రోజే విలేకరులు అడవిలో నడుచుకుంటూ వెళ్లినా అక్కడికి అటవీ అధికారులు అనుమతించలేదు. అసలు అక్కడ ఏం జరిగిందో ఎవరికి తెలియదు. రెండు పులుల మధ్య జరిగిన ఘర్షణలో ఒక పులి మృతి చెందిందని చెప్పి అధికారులు చేతులు దులుపుకున్నారు. రెండో పులి మృతి చెందిన సమయంలో కూడా అదే పరిస్థితి. విలేకరులు సంఘటనాస్థలానికి రాకుండా పది మంది అటవీ సిబ్బందిని బందోబస్తుగా ఉంచి మరీ రహస్యంగా విచారణ చేపట్టారు. విలేకరులు పట్టు పట్టి సంఘటనాస్థలానికి వెళ్లే ప్రయత్నం చేయగా, పీసీసీఎఫ్ డొబ్రియాల్ వచ్చి పులి మెడకు ఉచ్చు ఉందని, విష ప్రయోగంతో కూడా పులి మరణించి ఉండవచ్చని ప్రకటించి వెళ్లిపోయారే తప్ప సంఘటనాస్థలానికి మాత్రం విలేకరులను అనుమతించలేదు. గురువారం అదుపులోకి తీసుకున్న వ్యక్తులను డివిజన్ కార్యాలయానికి తీసుకురాగా, అపుడు కూడా కార్యాలయం గేట్లను మూసివేశారు. విలేకరులను లోనికి అనుమతించలేదు.

తమ మీదికి రాకుండా ఉండేందుకేనా...?

పులులు ఎలాగూ మృతి చెందాయి, ఇప్పుడు తమ ఉద్యోగాలకు ఎందుకు ఎసరు పెట్టుకోవడమనే ఆలోచనతోనే అధికారులు ఈ రహస్య విచారణ చేపడుతున్నారా అనే అనుమానాలు సర్వత్రా వినిపిస్తున్నాయి. మారుమూల దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న గిరిజనులపై నెపం వేసి తమ తప్పేం లేదని చెప్పుకునేందుకే ఈ డ్రామా ఆడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఆదివాసులను అదుపులోకి తీసుకోవడాన్ని ఆదివాసీ నాయకుడు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ సిడాం గణపతి తీవ్రంగా ఖండించారు. గురువారం కాగజ్‌నగర్ అటవీ డివిజన్ కార్యాలయానికి వచ్చిన ఆయన వారి కుటుంబసభ్యులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అటవీ అధికారుల తీరుపై మండిపడ్డారు. ఆదివాసులు నిజంగా తప్పు చేస్తే కేసు నమోదు చేసి జైలుకు పంపాలే తప్ప కార్యాలయానికి తీసుకువచ్చి చితకబాదడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆదివాసులు చేసిన తప్పును విలేకరుల సమక్షంలో ఆధారాలతో సహా చూపించి అరెస్ట్ చేయాలని సూచించారు. అధికారులు తమ ఉద్యోగాలు కాపాడుకునేందుకే ఈ డ్రామా ఆడుతున్నారని మండిపడ్డారు.



గురువారం ఇతర పులుల కోసం గాలిస్తున్న అటవీ సిబ్బంది

చట్టసభల్లో బీసీల వాటాకు మహా పాదయాత్ర

- ఆలిండియా ఓబీసీ ఐకాస చైర్మన్ సాయిని నరేందర్



నవతెలంగాణ-హాజీపూర్

ప్రజాస్వామిక ఉద్యమాల్లో అత్యున్నత పోరాట రూపమైన మహా పాదయాత్రతో బీసీలకు చట్టసభల్లో వాటా సాధించగలమని ఆల్ ఇండియా ఓబీసీ ఐకాస చైర్మన్ సాయిని నరేందర్ అన్నారు. గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బీసీ భవన్‌లో జరిగిన బీసీ మహా పాదయాత్ర సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ఉత్పత్తి, శ్రమలో కీలకపాత్ర పోషిస్తున్న బీసీలు తరతరాలుగా దోపిడీకి గురవుతున్నారని, సకల సామాజిక రంగాల్లో జనాభా దామాషా ప్రకారం వాటా దక్కాలంటే చట్టసభల్లో వాటా ద్వారానే సాధ్యమవుతుందని అన్నారు. ఎన్నో ఉద్యమాలకు నేతృత్వం వహించిన ఆదిలాబాద్ ప్రాంత బీసీ టైగర్ కొండా లక్ష్మణ్ బాపూజీ లాంటి మహనీయుల జన్మస్థలాలను సందర్శించి వారి త్యాగాలను ప్రజలకు బోధించి స్ఫూర్తిదాయక ఉద్యమాలను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ఈ సమావేశానికి హాజరైన తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మేకపోతుల నరేందర్‌గౌడ్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ పదేళ్లుగా భారతదేశానికి ప్రధానిగా ఉన్నా బీసీల కోసం ఏమీ చేయలేదని, చట్టసభల్లో బీసీలకు వాటా లేనంతకాలం దేశ ప్రధాని కూడా ఏమీ చేయలేడని అన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన హిందూ బీసీ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షులు బత్తుల సిద్ధేశ్వర్లు మాట్లాడుతూ ప్రజల హక్కుల కోసం, విముక్తి కోసం ఎన్నో పోరాటాలు చేసిన అనుభవం, చరిత్ర, తెగువ కలిగిన తెలంగాణ ప్రాంతం నుండే బీసీ ప్రజల విముక్తి పోరాటానికి నాంది పలకడం గొప్ప విషయమని, ఆల్ ఇండియా ఓబిసి తొలి సమావేశం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుండి ప్రారంభం కావడం కూడా విజయానికి సూచికని అన్నారు. స్వాతంత్ర ఉద్యమం నుండి దేశంలో ప్రతి ఉద్యమ విజయం వెనుక పాదయాత్ర ఉందని, అలాంటి పాదయాత్రతోనే చట్టసభలలో బీసీల వాటా సాధించగలమని పేర్కొన్నారు. బీసీల ఉద్యమానికి మంచిర్యాల ప్రజలు మద్దతుగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఒబిసి జాక్ వైస్ చైర్మన్ దిడ్డి విష్ణుమూర్తి, సభ్యులు చాపర్తి కుమార్ గాడ్గే, ఆకుల సంజీవరావు, బత్తుల ప్రకాష్, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు బొల్లం లింగమూర్తి, బీసీ మహిళ సంఘం రాష్ట్ర నాయకురాలు సిరవేని స్వప్న, రాష్ట్ర కార్యదర్శి గిరగాని భిక్షపతిగౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎర్ర శ్రీహరిగౌడ్, నాయకులు తవతం సత్యం, కాల్వ మధు బాబు, కిషన్, ఉస్మానియా విద్యార్థి నాయకులు పాలడుగు శ్రీనివాస్, దామెర గోపీక్రిష్ణ, నగరి ప్రవీణ్ కుమార్, మంచిర్యాల జిల్లా బీసీ ఐక్య వేదిక కన్వీనర్ వడ్డెపల్లి మనోహర్, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, సీనియర్ బీసీ నాయకులు కనుకుంట్ల మల్లయ్య, ఎండి ఇబ్రహీం, మేరు సంఘం మంచిర్యాల మండల అధ్యక్షులు మాడిశెట్టి సత్యనారాయణ, పద్మశాలి సంఘం నాయకులు చలమల్ల అంజయ్య, సుదర్శన్, అఖిల గాండ్ల తెలికుల సంఘం జిల్లా అధ్యక్షులు బుద్ధి చంద్రమౌళి, కురుమ సంఘం జిల్లా నాయకులు సమ్ము రాజన్న, సింగరేణి ఐక్యవేదిక నాయకులు పెద్దపల్లి కోటిలింగం, పెరక సంఘం నాయకులు శంకరయ్య, కాన్కూరు శ్రీనివాస్ యాదవ్, బీసీ నాయకులు నీరటి రాజన్న, సోమయ్య, భూమన్న పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో సీఓఈ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-తాండూర్

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ మూడు రోజులపాటు యాదాద్రి జిల్లా జగద్గిరిగుట్టలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఇగ్నైట్ ఫెస్ట్‌లో భాగంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో బెల్లంపల్లి సిఓఈ విద్యార్థులు మొదటి బహుమతి సాధించారు. 7, 8 తరగతులు చదువుతున్న కె.భరద్వాజ్, సిహెచ్.సంజయ్ అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే రాపిడ్ గ్రౌండ్, ఫొటో ఫ్రేమ్, షార్ట్ మెమొరీ వంటి 5 అంశాలలో ఉత్కంఠ భరితంగా సాగిన క్విజ్ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ ఐనాల సైదులు తెలిపారు. మొదటి బహుమతి సాధించిన ఇద్దరు విద్యార్థులకు రూ.10వేల నగదు బహుమతిని సంక్షేమ గురుకులాల కార్యదర్శి డాక్టర్ ఈ.నవీన్ నికోలస్ అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రెటరీ కంభంపాటి శారద, డిప్యూటీ సెక్రటరీ డి.వెంకటలక్ష్మి, ఆర్సిఓ పాల్గొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కోట రాజ్‌కుమార్, జెవిపి కొక్కుల రాజేశ్వర్, ఉపాధ్యాయులు భోగ అశోక్, పొన్నం శ్రీనివాస్, కౌసర్, మల్లిఖార్జున్, శ్యామ్‌సుందర్, రాజు పాల్గొన్నారు.

హైమన్ డార్ఫ్ సేవలు మరువలేనివి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిమ గిరిజనుల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహనీయులు హైమన్ డార్ఫ్ దంపతులు అని ఎంపీ టికెట్ ఆశావహురాలు డి.శ్రీలేఖ ఆదివాసీ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ చౌరస్తాలో కుమురం భీం విగ్రహానికి, హేమన్ డార్ఫ్ దంపతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కడో విదేశాల్లో పుట్టి మారుమూల గిరిజన సంస్కృతి, వారి జీవనశైలిపై అధ్యయనం చేస్తూ జైనూర్ మండలం మార్లవాయిలో స్థిరపడ్డారన్నారు. గిరిజనుల కష్టాలను అప్పటి ఆంగ్లేయ ప్రభుత్వంతో చర్చించినట్లు పేర్కొన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో తిరుగుతూ వారితో మమేకమై ఇక్కడే కాలం వెళ్లదీశారని పేర్కొన్నారు. గిరిజనుల కోసం అహర్నిశలు పాటుపడిన హైమన్ డార్ఫ్ దంపతుల వర్ధంతులను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదిమ గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

ట్రాఫిక్ నియమాలు, సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి, అప్రమత్తంగా ఉండాలని మందమర్రి సిఐ మహేందర్‌రెడ్డి, పట్టణ ఎస్ఐ రాజశేఖర్ సూచించారు. గురువారం పట్టణంలోని గద్దేరాగడి క్రెస్ట్ పాఠశాలలో విద్యార్థులకు ఆన్‌లైన్ మోసాలను ఎలా అడ్డుకట్ట వేయాలని తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ - కాసిపేట

భవిత కేంద్రాలను దివ్యాంగ పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ ప్రభాకర్ మాట్లాడుతూ 18 ఏళ్లలోపు దివ్యాంగ పిల్లలకు సోమవారం నుంచి శుక్రవారం వరకు సేవలు అందించడం జరుగుతుందని, సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి నెల గురువారం నాడీ వ్యవస్థ లోపం, ఆర్థోపెడిక్ సమస్యలను వైద్యులు చూస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ హెచ్ఎం ఉషా, ఉపాధ్యాయులు రంజిత్, ఫిజియోథెరపిస్టు కుమారస్వామి, ఐఈఆర్పీ శ్రీలత, విద్యార్థులు పాల్గొన్నారు.

మూత బడులకు మోక్షం..!

- తెరిపించేందుకు ప్రభుత్వం సన్నాహాలు
- పీటీజీ ఆవాస ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి
- పాఠశాల లేని ఊరిలోనూ నిర్మాణానికి ప్రణాళిక
- వచ్చే విద్యా సంవత్సరంలో అందుబాటులోకి

పిల్లలు లేరనే కారణంగా మూతపడిన ప్రభుత్వ బడులకు మోక్షం లభించనుంది. ప్రతి ఊరిలో బడి ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో మూతపడిన బడులు మళ్లీ తెరుచుకోనున్నాయి. దీంతో బడి లేదనే కారణంగా చదువుకు దూరమైన అనేక మంది పేద పిల్లలకు ప్రయోజనం కల్గనుంది. ప్రభుత్వ సూచనల మేరకు విద్యాశాఖ అధికారులు ఇప్పటికే మూతపడిన బడుల వివరాలను సేకరించారు. మరోపక్క కేంద్రప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన ప్రధాన మంత్రి జన్‌మన్ పథకంలో భాగంగా ఆదిమ గిరిజన తెగలు(పీవీటీజీ) ఆవాస ప్రాంతాల్లో సకల సౌకర్యాలు కల్పించాలని సంకల్పించింది. ఇందులో భాగంగా ఈ ప్రాంతాల్లోనూ బడుల నిర్మాణం చేపట్టి నిరుపేద గిరిజన పిల్లలకు విద్యను అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తోంది. ఇప్పటికే పీవీటీజీ ఆవాస ప్రాంతాల్లో బడులు లేని వాటిని అధికారులు గుర్తించారు. వీటిలోనూ కొత్తగా నిర్మించాలని నిర్ణయించడంతో ఆదిమ గిరిజన పిల్లలకు లాభం జరగనుంది.


నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

సమాజాభివృద్ధిలో విద్యకు అత్యంత ప్రాధాన్యం ఉంటుంది. తాజాగా కొత్తగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం సైతం విద్యపై ప్రత్యేక దృష్టిసారిస్తోంది. ఇందులో భాగంగా ఇటీవల విద్యాశాఖపై ముఖ్యమంత్రి నిర్వహించిన సమీక్షలో పలు విషయాలు వెల్లడించారు. ఉపాధ్యాయుల పోస్టుల భర్తీతో పాటు ప్రతి గ్రామ పంచాయతీలో తప్పనిసరిగా బడి ఉండాలని స్పష్టం చేశారు. దీంతో ఇన్నాండ్లు పిల్లలు లేరనే కారణంగా మూతపడి ఉన్న బడులను మళ్లీ తెరిపించేందుకు విద్యాశాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే జిల్లాలో మూతపడిన బడుల వివరాలను సేకరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక కిలో మీటరు దూరంలో ప్రాథమిక పాఠశాల, 3 కిలోమీటర్ల వ్యవధిలో ప్రాథమికోన్నత, 5కిలో మీటర్ల దూరంలో ఉన్నత పాఠశాల ఉండాల్సి ఉంటుంది. ఇది వరకు చేపట్టిన హేతుబద్ధీకరణలో భాగంగా తక్కువ మంది పిల్లలు ఉన్నారనే కారణంగా కొన్ని బడులను మూసివేశారు. దీంతో ఆయా గ్రామాల్లో బడి అందుబాటులో లేని కారణంగా పిల్లలు ప్రాథమిక విద్యకు దూరమవుతున్నారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యపై దృష్టిసారించి వాటిలో మళ్లీ తెరిపించాలని ఆదేశాలు జారీ చేయడంతో అధికార యంత్రాంగం ఆ దిశగా చర్యలు చేపట్టింది.

ఉమ్మడి జిల్లాలో అనేక చోట్ల..!

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అనేక గ్రామాల్లో బడులు లేని పరిస్థితి ఉంది. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో ఈ సమస్య మరింత అధికంగా ఉంది. ఆదిలాబాద్ జిల్లాలో మూతపడిన ప్రభుత్వ జిల్లా పరిషత్ బడులు సుమారు 10వరకు ఉండగా.. ఇదే జిల్లా పరిధిలోని ఐటీడీఏ ఆధ్వర్యంలోని పీవీటీజీ ఆవాస ప్రాంతాల్లో 34 చోట్ల బడులు లేవని అధికారులు గుర్తించారు. ఇందులో 8 చోట్ల ఒక కిలోమీటర్ దూరంలో పాఠశాలలు ఉండగా మరో ఆరు చోట్ల పిల్లలు లేరని గుర్తించారు. మిగితా 20చోట్ల బడులు అవసరమని గుర్తించి కేంద్రానికి నివేదిక పంపించారు. మిగితా నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలోనూ విద్యాశాఖతో పాటు ఐటీడీఏ కూడా విస్తరించి ఉంది. ఈ మూడు జిల్లాల్లోనూ అధిక సంఖ్యలోనే మూతబడులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ జిల్లాల్లోనూ మూతపడిన వాటిని తెరిపించడం.. లేనివాటిలో నిర్మించడం వంటి ప్రణాళిక రూపొందించినట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి.

పిల్లలు లేని బడులను గుర్తించాం : నారాయణ, విద్యాశాఖ సెక్టోరల్ అధికారి



ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశం మేరకు జిల్లాలో పిల్లలు లేని కారణంగా మూతపడిన బడులను గుర్తించాం. వీటితో పాటు పీవీటీజీ ఆవాస ప్రాంతాల్లో ఎక్కడెక్కడ పాఠశాలలు లేవో వాటి వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక పంపించాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే తదుపరి చర్యలు తీసుకుంటాం.



ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం పీచర గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన పిల్లలు వీరు. ఇక్కడ 23మంది పిల్లలు ఉన్నారు. కానీ ఈ ఊరిలో బడి లేదు. పీచర్ గ్రామం కనీసం మూడు కిలో మీటర్ల దూరంలో ఉండటంతో బడికి వెళ్లడం లేదు. పీవీటీజీ ఆవాస ప్రాంతం కాకపోవడం..మరోపక్క జీపీ పరిధిలోనూ ఈ గ్రామాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. ఇలాంటి వాటిని విద్యాశాఖ అధికారులు గుర్తించి బడి నిర్మాణం చేపడితే పేద పిల్లలకు ప్రయోజనం కలుగుతుంది.



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని భుక్తాపూర్ కాలనీలో ఆరేండ్ల క్రితం మూతపడిన పాఠశాల ఇది. ఇక్కడి పిల్లలను ఇతర చోట్లకు పంపించారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో ఇలాంటి బడులన్ని మళ్లీ తెరుచుకోనున్నాయి. స్థానిక పేద పిల్లలకు సులభంగా లభించే ఆస్కారం ఉంటుంది.

విజేత స్కూల్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలు



నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండల కేంద్రంలోని విజేత స్కూల్‌లో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వేసిన రంగు రంగుల రంగవల్లులు ఆకట్టుకున్నాయి. ఆకాశపు అంచులదాక పంతగులు ఎగురవేసి కేరింతలు కొట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులకు సంక్రాంతి పండుగ విశిష్ఠత గురించి తెలియజేసేందుకే ముందస్తు సంక్రాంతి పండుగ నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుఖేష్, సతీష్, చంద్రకళ, నాగమణి, సుష్మిత, నిఖిల, ప్రతిభారాణి, నిఖిత, శరణ్య, విజయశ్రీ పాల్గొన్నారు.

వశిష్ట హైస్కూల్‌లో..

నిర్మల్ : ఆదర్శ్ నగర్‌లోని వశిష్ట హైస్కూల్‌లో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలను జరుపుకున్నారు. విద్యార్థులు పాఠశాల ఆవరణను పూర్తిగా ముగ్గులతో అలంకరించారు. ఈ సందర్భంగా వశిష్ట విద్యా సంస్థల చైర్మన్ గొల్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ పండుగ ప్రాముఖ్యతను వివరించారు. తరతరాలుగా వస్తున్న సంస్కృతి సంప్రదాయాలను ఆచరిస్తూ వాటిని భవిషత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ దేవిదాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నిర్మల్ : వశిష్ట హైస్కూల్‌లో..

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
శుక్రవారం | జనవరి 12, 2024 | www.navatelangana.com

లయన్స్ క్లబ్ నూతన గవర్నర్‌కు సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

లయన్స్ క్లబ్ నూతన గవర్నర్ హన్మాండ్ల రాజిరెడ్డిని లయన్స్ క్లబ్ ఆదిలాబాద్ సభ్యులు సన్మానించారు. కరీంనగర్ నుంచి గురువారం ఆదిలాబాద్‌కు వచ్చిన ఆయనను సభ్యులు గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా లయన్స్ క్లబ్ సేవలను మరింత విస్తరిస్తామని తెలిపారు. అనంతరం సేవ కార్యక్రమంలో భాగంగా ఆదిలాబాద్ ప్రెస్‌క్లబ్‌కు వాటర్ కూలర్ అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు సామ రాజేంద్రప్రసాద్, దుద్దిళ్ల నారాయణరావు, రమాకాంత్, కాటిపెల్లి రాంరెడ్డి, శివ, శ్రీనివాస్, బుక గంగయ్య, సభ్యులు పాల్గొన్నారు.



రేషన్ దుకాణాల్లో నాణ్యత బియ్యం వచ్చే విధంగా కృషి చేస్తా : డీఎస్‌ఓ

నవతెలంగాణ-బోథ్

రేషన్ దుకాణాల్లో నాణ్యత బియ్యం వచ్చేవిధంగా కృషి చేస్తానని డీఎస్‌ఓ కిరణ్ కుమార్ అన్నారు. గురువారం మండలకేంద్రంలోని స్థానిక తహసీల్దార్, ఎంపీడీఎఓ కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం రేషన్ 2, 5, నెంబర్ దుకాణాల్లోని ప్రజాపాలన ప్రత్యేక అధికారి, డీఎస్‌ఓ కిరణ్ కుమార్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అలాగే నాణ్యత బియ్యం వస్తలేదనే ఆరోపణలు రావడం నాణ్యత గల బియ్యాన్ని పంపిణీ చేస్తానని అన్నారు. అనంతరం సొనాలలో పలు రేషన్ దుకాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో డీటీ శ్యాంసుందర్ పాల్గొన్నారు.



వడ్డె ఓబన్న పోరాట స్ఫూర్తిని భావి తరాలకు చాటి చెప్పాలి

- అధికారికంగా ఒడ్డె ఓబన్న జయంతి వేడుకలు
- పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

స్వతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న పోరాట స్ఫూర్తిని భావి తరాలకు చాటి చెప్పాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వతంత్ర్య సమర యోధుడు వడ్డె ఓబన్న 217 జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయల శంకర్‌తో కలిసి ఆయన పాల్గొని, ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు తెలియజేయాలి

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వడ్డె ఓబన్న పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు తెలియజేయాలని అన్నారు. ప్రభుత్వం స్వతంత్ర్య సమరయోధులు, మహనీయుల జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహిస్తోందని అన్నారు. ఓబన్న జయంతి సందర్భంగా ప్రజలందరి శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్ర్య పోరాటంలో వడ్డె ఓబన్న పోరాటం వీరోచితమని, మహనీయుని చరిత్ర నేటి యువతకు ఆదర్శ ప్రాయమని అన్నారు. వడ్డెర కులస్తుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సమాజ హితం కోసం పోరాడిన వీరుడు

ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజ హితం కోసం పోరాడిన ఓబన్న పోరాటం మరువలేనిదని అన్నారు. వడ్డెర కులస్తుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వ కర్మ పథకంలో రుణాల మంజూరుకు కులవృత్తులు చేసేవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పట్టణంలో సంఘ భవన నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. అదే విధంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రవేశ పెట్టిన విశ్వకర్మ యోజన పథకంలో ఎలాంటి పూచికత్తు లేకుండా మూడు లక్షల వరకు రుణాలు పొందవచ్చని తెలిపారు. కులవృత్తులు చేసుకునే వడ్డెర కులస్తులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖుష్బు గుప్తా, బీసీ సంక్షేమ అధికారి రాజలింగు, మైనారిటీ సంక్షేమ అధికారి రాథోడ్ రమేష్, వివిధ కుల సంఘాల నాయకులు అధికారులు, పాల్గొన్నారు.

నిర్మల్ : ఒడ్డెర కుల ఆరాధ్య దైవం అయిన ఒడ్డె ఓబన్న జయంతిని పురస్కరించుకొని గురువారం నిర్మల్ కలెక్టరేట్‌లోని మినీ సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఒడ్డె ఓబన్న చిత్రపటానికి అదనపు కలెక్టర్‌లు కిషోర్ కుమార్, ఫైజాన్ అహ్మద్‌లు జ్యోతి ప్రజ్వలన గావించి, చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్‌లు మాట్లాడుతూ ఓబన్న 208వ జయంతిని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించడం జరిగిందని, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చేసిన సాయుధ పోరాటంలో ఒడ్డె ఓబన్న సైన్యాధ్యక్షుడుగా పని చేశారని, సంచార జాతిలో పుట్టిన ఆయన సేవలు మరువలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రాజేశ్వర్‌గౌడ్, జిల్లా అధికారులు, ఒడ్డెర సంఘం జిల్లా అధ్యక్షులు ప్రభాకర్, వేముల గురువయ్య, మక్కల గంగాధర్, నర్సయ్య శ్రీనివాస్, లక్ష్మణ్, రాములు, పాల్గొన్నారు.



పాలిటెక్నిక్ కళాశాలలో రంగోళి పోటీలు



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ముందస్తుగా పండుగ వేడుకలను ఆయా పాఠశాల, కళాశాలలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం పట్టణంలోని ప్రభుత్వ సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థినులకు రంగోలి, పెయింటింగ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ భరద్వాజ ప్రారంభించారు. పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొనగా పోటాపోటీగా ముగ్గులు వేశారు. అనంతరం విజేతలను ప్రకటించి, వారికి కళాశాల ప్రిన్సిపాల్ పి.భరద్వాజ బహుమతులు ప్రధానం చేసి అభినందించారు. అలాగే సంక్రాంతి పండుగ విశిష్టత గురించి విద్యార్థినులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విభాగాల అధిపతులు రాజ్‌కుమార్, వీరస్వామి, రాజన్న, సురేష్, అనిల్ కుమార్, అధ్యాపకులు శ్రీనివాస్, ప్రవీణ్, రామేశ్వర్‌రెడ్డి, సుధాకర్, విజయలక్ష్మి క్రాంతి కుమార్, జ్యోత్స్నారాణి, యశశ్రీ, సంగీత, హేమలత, మురళి కృష్ణ, సంతోష్ ఉన్నారు.

హిమాలయ పర్వతాన్ని అధిరోహించిన విద్యార్థులు



నవతెలంగాణ-ముధోల్

ముధోల్ నియోజకవర్గానికి చెందిన నాలుగురు విద్యార్థులు ఎన్ఎస్ఎస్ అధ్వర్యంలో నిర్వహిస్తున్న క్యాంపులో భాగంగా ముధోల్ నియోజకవర్గానికి చెందిన పలువురు విద్యార్థులు హిమాలయ పర్వతాన్ని అధిరోహించారు. ఈ విద్యార్థులు తెలంగాణ విశ్వవిద్యాలయంలో విద్యను అభ్యసిస్తున్నారు. ఇందులో ఎర్రం సురేష్ (బోరిగాం), లింగురమోల్లు సంతోష్ (భైంసా), ఉమ్మెడ వినోద్ (భోసి), దీపిక (మహాలింగి) గ్రామానికి చెందిన వారు. సముద్ర మట్టానికి 2,875 మీటర్ల ఎత్తులో ఉన్న హిమాలయా పర్వతాన్ని విద్యార్థులు అధిరోహించారు. దీంతో తెలంగాణ విశ్వవిద్యాలయ అధికారుల, ప్రముఖుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. వీరికి ముధోల్ సర్పంచ్ వెంకటాపురం రాజేందర్ అభినందనలు తెలిపారు. ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించటంలో నియోజకవర్గానికి చెందిన విద్యార్థులు పాల్గొనటం గర్వకారణమని అన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. గురువారం విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ భవనంలో సంఘం నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగులు వారి సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. అనంతరం ఎమ్మెల్యేను సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో ఉద్యోగులు, పెన్షనర్లకు నెలనెల వేతనాలు సరిగ్గా రాలేదన్నారు. అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పిన బీఆర్ఎస్ నాయకులు వేతనాలు ఇవ్వలేని దుస్థితిలో ఉండేదన్నారు. ఓటు సరైన రీతిలో వినియోగించనప్పుడు వ్యవస్థ బాగుపడదని, ప్రతి ఒక్కరు వారి ఓటును సరైన నాయకత్వం కోసం వినియోగించాలన్నారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కరానికి అసెంబ్లీలో ప్రస్తవించడంతో పాటు చీఫ్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు లక్ష్మారెడ్డి, నర్సయ్య, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అప్పుడూ... ఇప్పుడూ ఒకేలా.!

- మంత్రి సీతక్క శైలిపై ప్రశంసలు



రోడ్డుపై మొక్క జొన్న కంకులను కొనుక్కొంటున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

నవతెలంగాణ-ఖానాపూర్ టౌన్

సాధారణంగా ఏ నాయకులైనా అధికారం ఉన్నప్పుడు ఒకలా, లేనప్పు మరోలా ఉండటం సహజం. కాని మంత్రి హోదాలో ఉన్నా సీతక్క మాత్రం అప్పుడూ.. ఇప్పుడూ ఒకేలా తన శైలిని ప్రదర్శించడాన్ని అందరూ అభినందిస్తున్నారు. పదవి రాగానే ధర్పం ప్రదర్శించడమే గొప్పగా భావించే ఇతర నాయకల వవ్యవహార శైలికి భిన్నంగా మంత్రి సీతక్క ఉంటుంది. తన వాహనం ఆపుకొని రోడ్డు పక్కన మొక్క జొన్న కంకులను కొనుక్కొని తినడం వైరల్‌గా మారింది. బుధవారం సదర్‌మాట్ సందర్శన అనంతరం కడెం ప్రాజెక్టును పరిశీలించిన సీతక్క ఉట్నూర్ వెళ్తున్న సమయంలో ఉడుంపూర్ వద్ద రోడ్డు పక్కన ఓ వృద్ధురాలు మొక్క జొన్న కంకులను కాల్చి అమ్మడాన్ని చూసింది. ఆ క్రమంలో వృద్ధురాలి దగ్గర ఆగిన సీతక్క మొక్కజొన్న కంకులను కొనుక్కొని తాను రుచీ చూసి తన వెంట ఉన్నావారందరికి కొనిచ్చారు. పదవి రాగానే అదే గొప్పగా బావించే, ఇతర నాయకులకు సీతక్క శైలి కనువిప్పుగా ఉందంటూ చర్చించుకుంటున్నారు. ఒక మంత్రి సాదారణ పౌరుల మాదిరిగా రోడ్డుపై మొక్క జొన్న కంకులను కొనుక్కొని తినడం, తన వెంట ఉన్నవారికి సైతం రుచి చూపించడం నిజంగా అభినందనీయమే. మంత్రి సీతక్క రోడ్డుపై మక్క కంకులు కొనుక్కొని తినడం సోషల్ మీడియాలో ప్రధాన చర్చగా మారింది. నాలుగు రోజుల క్రితం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సైతం అదే మాదిరిగా రోడ్డుపక్కన మొక్కజొన్న కంకులను కొని తన సహజ గుణాన్ని ప్రదర్శించారు. ఎన్నికల సమయంలో కూలీగా, హోటల్ పనిమనుషులుగా, తోపుడు బండ్ల వ్యాపారులుగా నటించే నాయకులకు ఎన్నికల తర్వాత ఏలా ఉండాలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును చూసి నేర్చుకోవాలని, ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు.

ఇథనాల్ ఫ్యాక్టరీకి అనువైన ప్రదేశం కాదు

- జెడ్పీటీసీల జిల్లా ఫోరం అధ్యక్షుడు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి



నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండలంలోని దిలావర్‌పూర్, గుండంపల్లి వ్యవసాయ భూముల్లో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ స్థలాన్ని గురువారం జెడ్పీటీసీల జిల్లా ఫోరం అధ్యక్షుడు పత్తిరెడ్డిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి రైతులతో కలిసి పరిశీలించారు. రైతులు, గ్రామ యువకులు, ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మిస్తే, భవిష్యత్తులో జరిగే ఇబ్బందులు ఫ్యాక్టరీ వల్ల కలిగే సమస్యల గురించి ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాక్టరీకి ఇది అనువైన ప్రదేశం కాదని, ఫ్యాక్టరీ నిర్మాణం వెంటనే నిలిపివేసి ఇక్కడి నుంచి తరలించాలని కోరారు. ఫ్యాక్టరీ పనులు నిలిపివేయకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పోరాడుతున్న ఉద్యమకారులకు అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. తప్పుడు అనుమతులతో పచ్చని పంట పొలాల్లో నిర్మిస్తున్న ఫ్యాక్టరీ నిర్మాణం గురించి ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డిని దృష్టికి తీసుకుపోయామని తెలిపారు. సమస్య పరిష్కారానికి నావంతు కృషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు.

అడవుల్లో నిప్ప పెట్టకుండా కాపాడాలి



నవతెలంగాణ-పెంబి

అడవిలో నిప్పు పెట్టకుండా అడవిని ఏలా కాపాడాలని అటవీ క్షేత్రాధికారి పెంబి రేంజ్ ఆదేశాల మేరకు పెంబి రేంజ్ అధ్వర్యంలో లోతోర్య తాండ గుమ్మే నా యంగ్లాపూర్ కులం గూడా గ్రామాలలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు గ్రామాలలోని అటవీ వన్యప్రణాలను నిప్పునుండి కాపడలి అటువిలో నిప్పు ఎంత ప్రమాదకరమైనదని దాని నుంచి వచ్చే ప్రమాదాల గురించి గ్రామ సర్పంచ్ సాంకి బాయి డిఆర్ఓ ప్రతాప్ నాయక్ అటవీ ప్రాంతాలలో మేపడానికి తీసుకువెళ్లే కాపరి దగ్గర అగ్గిపెట్టెలు లేకుండా వెళ్లాలని సూచించారు కార్యక్రమంలో ఇటిక్యాల్ సెక్షన్ అధికారి కింగ్ ఫిషర్ యంగ్లాపూర్ సెక్షన్ అధికారి లచ్చయ్య సంతోష్ ఉదయ్ కుమార్ శివారెడ్డి మహేందర్ పాల్గొన్నారు

కౌలు రైతుల భద్రత చట్టాన్ని రూపొందించాలి

నవతెలంగాణ-తాంసి

పంట పొలాలను కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసుకుంటున్న చిన్న సన్నకారు రైతులకు కౌలు భద్రత చట్టాన్ని రూపొందించి, కౌలు రైతును ఆదుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. గురువారం బాధిత కుటుంబాన్ని సీపీఐ(ఎం) బృందం పరామర్శించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన కౌలు రైతు ఎడిపెల్లి రమేష్(50) పత్తి పంట దిగుబడి రాకపోవడంతో అప్పులు తీర్చలేననే అనే బాధతో పురుగులమందు తాగి, ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. 12 ఎకరాలను కౌలుకు తీసుకున్న రైతు రూ.8లక్షలు ప్రయివేటు అప్పులు చేశాడు . 12 ఎకరాల్లో కేవలం ఎకరాకు 5 క్వింటాళ్లు మాత్రమే పత్తి దిగుబడి వచ్చింది. పత్తికి గిట్టుబాటు ధర లేకపోవడం, పెట్టుబడికి అధిక ఖర్చులు చేయడంతో అప్పులు తీర్చలేనెమోనన్న బాధతో దిగులు పడి రైతు ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు. కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబం రోడ్డున పడిందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆ కుటుంబానికి రూ.25లక్షల నష్టపరిహారం, 3 ఎకరాల ప్రభుత్వ భూమి మంజూరు చేయాలనీ డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమీషన్ సిఫార్సులను అమలు చేయాలని అన్నారు. శాస్త్రీయ పద్దతిలో పంటలకు గిట్టుబాటు ధరలను నిర్ణయించాలని అన్నారు. కౌలు రైతుల భద్రతకు చట్టాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వారిలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బండి దత్తాత్రి, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అన్నమొల్ల కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, పిప్పల్‌కోటి శాఖ కార్యదర్శి ధోనిపెల్లి స్వామి, నాయకులు హైదర్ పాల్గొన్నారు.



బాధిత కౌలు రైతు కుంటుబాన్ని పరామర్శించిన సీపీఐ(ఎం) బృందం

ఆధ్యాత్మిక మార్గంతోనే మనసుకు ప్రశాంతత



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆస్తులు, డబ్బు, అధికారంతో మానసిక ప్రశాంతత లభించదని, అది కేవలం ఆధ్యాత్మిక మార్గం ద్వారానే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. గురువారం ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాలువాతో సన్మానించి, జ్ఞాపికను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ గ్రామాలైతే ఆధ్యాత్మిక మార్గంలో పయనిస్తాయో అక్కడ క్రైమ్ కూడా తగ్గుతుందన్నారు. మనిషి మనిషిగా జీవించినప్పుడే జీవితనానికి సర్థకత లభిస్తుందన్నారు. ఈశ్వరీయ బ్రహ్మకుమారీస్ చేస్తున్న కార్యక్రమాలు ప్రతి మారుమూల పల్లెకు చేరవేసేలా కృషి చేయాలన్నారు. తనవంతుగా కూడా సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకురాలు రేవతి బహేన్జీ, రాము, అరుణ్, రాంనాథ్, బీజేపీ నాయకులు ఆదినాథ్, లాలా మున్నా, జోగు రవి, వేదవ్యాస్, రాము పాల్గొన్నారు.

భగీరథ నీళ్లు సరఫరా చేయాలి : జిల్లా కలెక్టర్



డాక్టర్ నిఖిల్ రాజ్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్

నవతెలంగాణ-తాంసి

వైద్య పరీక్షలతో పాటు మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులకు సూచించారు. గురువారం భీంపూర్ మండలంలోని గుబిడిపల్లి గ్రామంలోని పలువురు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకొని సంబంధిత అధికారులతో కలిసి బాధిత కుటుంబాలను కలిశారు. వ్యాధికి గల కారణాలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు తాగుతున్న నీటిని పరీక్షలు చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తక్షణమే గ్రామంలోని ప్రతి ఒక్కరికి వైద్య పరీక్షలు నిర్వహించి, మిషన్ భగీరథ వీటిని సరఫరా చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కిడ్నీ వ్యాధి లక్షణాలు కనిపించిన వారిని రిమ్స్‌కు తరలించి, అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించాలని డాక్టర్ నిఖిల్ రాజ్‌కు సూచించారు. అనంతరం జల్కోరి పాఠశాలను పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని, విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, మిషన్ భగీరథ అధికారి చంద్రశేఖర్, వైద్య సిబ్బంది ఉన్నారు.

కూరగాయల మార్కెట్ నిర్మాణానికి స్థల పరిశీలన



నవతెలంగాణ-ముధోల్

ముధోల్ అంగడిబజార్‌లో శాశ్వత ప్రాతిపదికన రైతుబజార్ నిర్మించుటకు కొరకు స్థలాన్ని గురువారం నాబార్డ్ జిల్లా అభివృద్ధి అధికారి వీరభద్రయ్య పరిశీలించారు. రైతులు కూరగాయలు విక్రయించడానికి, చేపలు ఇతరత్రా మాంసం విక్రయాలకు దుకాణం కోసం, మరుగుదొడ్లు, పార్కింగ్, నీటి సదుపాయం, లైటింగ్ ఇతరత్రా ఏరాట్లు చేయుటకు నాబార్డ్ సీఆర్డీ, రిలయన్స్ ఫౌండేషన్ తరపు నుంచి గ్రామ పంచాయతీ వారితో కలిసి సంయుక్తముగా రూ.16లక్షల అంచనా వ్యయంతో కూరగాయల మార్కెట్ నిర్మించుటకు గాను స్థల పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్డీ నిర్మల్ డైరెక్టర్ రాజు, పంచాయతీ కార్యదర్శి పోతన్న, సర్పంచ్ వెంకటాపురం రాజేందర్, ఉపసర్పంచ్ సంజీవ్, ఎంపీటీసీ భూమేష్, దేవోజి, వార్డు సభ్యులు సంగోళ్ల నవనీత పోతన్న, నాయకులు జమీల్, అజీజ్, లవన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
శుక్రవారం | జనవరి 12, 2024 | www.navatelangana.com

ఎరువుల దుకాణాల్లో డీఏఓ తనిఖీలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని ఎరువుల దుకాణాల్లో గురువారం జిల్లా వ్యవసాయ అధికారి(డీఏఓ) ఆర్.శ్రీనివాసరావు తనిఖీలు నిర్వహించారు. గోదాంలలో ఎరువుల నిల్వలను ఈపీఓఎస్ నిల్వలతో సరి చూశారు. రిజిస్ట్రార్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు ఆధార్ నమోదు చేయకుండా ఎట్టి పరిస్థితుల్లో అమ్మకాలు జరపకూడదని ఆదేచించారు. వారానికి పది దుకాణాల చొప్పున ఏఓలు, ఏడీఏలు నిల్వలపై తనిఖీ చేయాలని ఆదేశించారు. రైతులకు సరైన విధంగా సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ వ్యవసాయ అధికారి ఖాదర్ హుస్సేన్ పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులకు సన్మానం

నవతెలంగాణ-కెరమెరి



ఇటీవల మండలానికి బదిలీపై వచ్చిన నూతన తహసీల్దార్ షరీఫ్, డిప్యూటీ తహసీల్దార్ సంతోష్‌ను ఆదివాసీ నాయకులు సన్మానించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి వారిని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పట్నాపూర్ గ్రామంలో నిర్వహించే ఆదివాసీ కోలాం ఆరాధ్యాదైవం ఓం రాజ్ వంగేపూరి బీమయ్యాక్ స్వామి పూజ మహోత్సవ పోస్టర్లను ఆవిష్కరింపజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెందూర్ మోతిరాం, ఝరి సర్పంచ్ నాణేశ్వర్, గోండ్వాన రాయిసెంటర్, ఆదివాసీ సంఘాల నాయకులు ఆత్రం బొజ్జిరావు, సిడాం జగన్నాథ్ రావు, మడావి రఘునాథ్, కుర్సెంగ దందు, సిడాం ధర్ము, సెడ్మాకి తుకారాం, పెందూర్ శ్రీనివాస్, ఆత్రం భీంరావు, టెకం భీంరావు, బిర్షావ్ పాల్గొన్నారు.

'గ్రామీణ యువత చైతన్యానికి క్రీడలు ఉపయోగపడతాయి'



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గ్రామీణ యువత చైతన్యం, నైపుణ్యాలు పెంపొందించడానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడ పాఠశాలలో మూడు రోజులుగా కొనసాగుతున్న ఎంపీపీ కప్ క్రీడ పోటీల్లో విజేతలకు అదనపు కలెక్టర్ దాసరి వేణు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జెడ్పీటీసీ నాగేశ్వరరావు, నిర్వహణ కమిటీ అధ్యక్షుడు ఎంపీపీ మల్లికార్జున్‌తో కలిసి బహుమతుల ప్రధానం చేశారు. సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ యువతలో చైతన్యం పెంచడానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. క్రీడాకారుల్లో నైపుణ్యం పెరుగుతుందన్నారు. గెలిచిన క్రీడాకారులు గర్వపడకుండా ఓడిన క్రీడాకారులు బాధపడ కుండ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఓటమి గెలుపుకు తొలిమెట్టని గెలుపు కోసం కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా డీటీఓ గంధం లక్ష్మిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శశికళ, ఎంఈఓ మను కుమార్, సింగల్ విండో చైర్మెన్ అలీబీన్ అహ్మద్, జిల్లా క్రీడల అధికారి మీనారెడ్డి పాల్గొన్నారు.

పత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగువైపు ఆసక్తి చూపాలని మండల వ్యవసాయ శాఖ అధికారి రామక్రిష్ణ సూచించారు. గురువారం మండలంలోని బోడపల్లి, అందవెల్లి, వల్లకొండ గ్రామాల్లో రబీ సీజన్‌లో సాగు చేసున్న పంటలను ఏఓ పరిశీలించారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు, ఖర్చులు తగ్గించుకునేందుకు చేపట్టాల్సిన చర్యలను రైతులకు వివరించారు. పంటల నమోదు తప్పకుండా చేసుకోవాలని, పంట నమోదు చేసుకోకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. రైతులు సంప్రదాయ పంటలైన వరి, పత్తి పంటలే కాకుండా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడితో పాటు అధిక లాభం వచ్చే పంటలు సాగు చేసుకోవాలన్నారు. కూరగాయలు, ఎండు మిర్చి, స్వీట్ కార్న్, డ్రాగన్ ఫ్రూట్ వంటి పంటలు, పందిరి కూరగాయలను ఎత్తయిన బెడ్లు వేసుకొని సాగుచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

పీజీ ప్రవేశ పరీక్షలపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

దేశంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో పీజీలో ప్రవేశాలకు శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనర్సింహం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ పరీక్ష నోటిఫికేషన్ విడుదల చేసినందున ప్రస్తుతం డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థులతో పాటు డిగ్రీ పూర్తి చేసిన వారికి ఆయా ప్రవేశ పరీక్షలకు సంబంధించి కళాశాలలో ఉదయం 11 గంటలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవగాహన సదస్సులో సెంట్రల్ యూనివర్సిటీ పీజీ ప్రవేశ పరీక్ష, సిలబస్, దరఖాస్తు చేసే విధానం తదితర అంశాలపై విద్యార్థులకు వివరించనున్నట్లు పేర్కొన్నారు. పరిసర ప్రాంత డిగ్రీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ట్రెసా అధ్యక్షుడికి వీఆర్వోల సంఘం సన్మానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ట్రెసా జిల్లా అధ్యక్షుడు మధుకర్‌ను వీఆర్వోల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం వారు మాట్లాడుతూ వీఆర్వోలను గత ప్రభుత్వం అనేక ఇబ్బందులకు గురి చేసిందని, ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్న తమకు గుర్తింపు లేకుండా పోయిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం తిరిగి రెవెన్యూ శాఖకు కేటాయించాలని కోరారు. వీఆర్వోల సంఘం మాజీ జిల్లా అధ్యక్షులు శేక్ సుభాన్, ప్రధాన కార్యదర్శి ఫక్రుదాస్, జిల్లా కమిటీ సభ్యులు శంకర్, రాంచంధర్, అంకులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సంక్రాంతి ముగ్గుల పోటీలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని బూరుగుడా పాఠశాలలో విద్యార్థులకు ముగ్గులు, పతంగుల పోటీలు నిర్వహించారు. 8, 9, 10 తరగతి విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో సీనియర్, జూనియర్ విభాగాలుగా విభజించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులకు పండగ విశిష్టతను తెలియజేయడమే లక్ష్యంగా పోటీలు నిర్వహించినట్లు వివరించారు. పోటీల్లో విద్యార్థులు చురుగ్గ పాల్గొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శిల్ప, తిరుపతి, కుమార్, సత్యనారాయణ, శ్రీనివాస్, సదయ్య పాల్గొన్నారు.

బెజ్జూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా, తెలంగాణ జావిద్ ఆధ్వర్యంలో గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. 50 మంది విద్యార్థినీలు ముగ్గుల పోటీలో పాల్గొన్నారు. మొదటి బహుమతి పోసాల అక్షిత, ద్వితీయ బహుమతి ఆదే మానస, తృతీయ బహుమతి నికాడి శ్రీజతో పాటు పోటీలో పాల్గొన్న విద్యార్థులకు ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనాథ్, రవికుమార్, శ్రీనివాస్, జమీల్, యాకూబ్, ఆశజ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

పులి దాడిలో కోడే మృతి

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని మారుమూల గిరిజన గ్రామం ఉట్‌పల్లి సమీప అటవీ ప్రాంతంలో సోమవారం మేతకు వెళ్లిన మూడు సంవత్సరాల వయసుగలా కోడేపై పులి దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఉట్‌పల్లి గ్రామానికి చెందిన ఆత్రం శ్యాంరావు తన పశువులను మేతకు గ్రామ సమీప ప్రాంతానికి పంపించాడు. కోడేపై పులి దాడి చేయగా పులి పంజాదాటికి అక్కడికక్కడే మృతి చెందింది. పులి దాడి విషయాన్ని పశువుల కాపరి గ్రామస్తులకు సమాచారం ఇవ్వగా బాధితుడు అటవీ అధికారులకు తెలియజేశారు. ఘటన ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. నిత్యం ఫారెస్టు అధికారులు విధులు నిర్వహిస్తున్నప్పటికీ పులిజాడ తెలియరాకపోవడం ఇక్కడి ఫారెస్టు అధికారుల పని తీరుకు నిదర్శనం. ఈ మేరకు ఫారెస్టు అధికారులు విచారణ జరుపుతున్నారు.

అలంకారప్రాయంగా ఎత్తిపోతలు

- గత ప్రభుత్వం నిర్లక్ష్యం... కాంగ్రెస్ హయంలో మోక్షం లభించేనా..?
- నిర్వహణ లేక నిరుపయోగంగా పథకం
- తుమ్మిహేటి, వీర్దండి, గుండాయిపేట్, రణ్‌వెల్లి ఆయకట్టు రైతుల ఆవేదన

నవతెలంగాణ-కౌటాల

అలంకార ప్రాయంగా ఎత్తిపోతల పథకాలు దర్శనమిస్తున్నాయి. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నిరుపయోగంగా మారాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా పథకం పనిచేస్తాయా..? అని ఆయకట్టు రైతులు అంటున్నారు. మండలంలోని బీడు భూములకు సాగునీరు అందించి సస్యశ్యామలం చేసేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాణహిత నది మీద వీర్దండి, గుండాయిపేట్, తుమ్మిహేటి, రణ్‌వెల్లి వద్ద కోట్ల రూపాయలతో ఎత్తిపోతల పథకాన్ని నిర్మించింది. వెయ్యి ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీరు అందించేందుకు ఈ పథకం రూపొందించారు. ఒక్క తుమ్మిహేటి ఎత్తిపోతల పథకానికి సుమారుగా రూ.మూడు కోట్లతో 2011లో నిర్మించిన ఈ ఎత్తిపోతల పథకం ఆలనాపాలనా కరువై ప్రస్తుతం పనిచేయడంలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే పనిచేయలేదని కనీసం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా ఎత్తిపోతల పథకం సాగుకు నీరందించేనా..? అని రైతులు ఎదురుచూస్తున్నారు. కమిటీ సభ్యుల



నిరుపయోగంగా ఉన్న తుమ్మిహేటి ఎత్తిపోతల పథకం

నిర్వహణ లోపంతో ఆయకట్టు వ్యవసాయ భూములు బీడుగానే దర్శనమిస్తున్నాయి. ప్రాణహిత నదిలో నిండా నీరున్నా ఖరీఫ్, రబీ పంటలకు నీరు అందించే సామర్థ్యం ఉన్న ఈ పథకం నిర్వహణ లేక ఒక ఎకరానికి కూడా నీరందించని దుస్థితి ఏర్పడింది. ఇటీవల రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. ఈ ప్రభుత్వమైనా నిరుపయోగంగా ఉన్న ఎత్తిపోతల పథకాలు పనిచేసేలా చర్యలు చేపడుతాయాని రైతులు అనుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సైతం పట్టించుకోవడంలేదు. రైతులకు అవగాహన కల్పించి ప్రయోజనం చేకూర్చాలని అధికారులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు.

కార్మికులకు కోలిండియా వేతనాలు పెంచాలి

- సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం
- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కోల్ ట్రాన్స్‌ఫోర్టు కార్మికులకు కోలిండియా వేతనాలు పెంచాలని, లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ అన్నారు. గురువారం మూడో రోజు సమ్మెలో భాగంగా బోగె ఉపేందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగం సంస్థలైన సింగరేణిలో చాలీచాలని వేతనాలు తీసుకుంటూ సింగరేణి సంస్థకు లాభాలు రావడంలోనూ, సంస్థ అభివృద్ధి చెందడంలోనూ సింగరేణి కోల్ ట్రాన్స్‌ఫోర్టు కార్మికులు అత్యంత కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. కార్మికుల చట్టాలు అమలు చేయకపోవడం, కార్మికులు శ్రమదోపిడికి గురవుతున్నారన్నారు. దీనివల్ల వారి కుటుంబాలు రోడ్డున పడే అవకాశాలున్నాయన్నారు. డ్రైవర్లకు కనీస వేతనం రూ.32 వేలు, క్లీనర్‌లకు రూ.18 వేలు ఇవ్వాలని, బోనస్, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సింగరేణ, ట్రాన్స్‌ఫోర్ట్ యాజమాన్యానికి సెప్టెంబర్‌లో సమ్మె నోటీసు ఇచ్చామని, చర్చల పేరుతో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ప్రతినెల 10వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని, ప్రమాదబీమా ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలు ఇవ్వాలని, క్యాంటీన్ సౌకర్యం కల్పించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. సింగరేణిలో ఖాళీగా ఉన్న క్వార్టర్లను కోల్ ట్రాన్స్‌ఫోర్టు కార్మికులకు ఇవ్వాలని, రవాణా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో రేపటి నుండి సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కోల్ ట్రాన్స్‌ఫోర్టు వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) అధ్యక్షుడు అరికిల్ల స్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతి, ఉపాధ్యక్షులు లచ్చన్న, రవి, కార్యదర్శులు బుచ్చన్న, కృష్ణ, జాయింట్ సెక్రటరీ సాగర్, కోశాధికారి ఎం సత్యనారాయణ, సభ్యులు నంది రాజ్‌కుమార్, కొండగొర్ల చందు, జ్యోతిరావు, సంతోష్ పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి

- కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్

నవతెలంగాణ-కౌటాల

వచ్చే స్థానిక సంస్థలు, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని కాంగ్రెస్ సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ సూచించారు. గురువారం మండల కేంద్రంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉందని, మీరెవరు అధైర్య పడకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఐకమత్యంగా పోరాడాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వమే కేంద్రంలో కూడా ఏర్పడుతుందని ఆయన ధీమావ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

బెజ్జూరు : వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలుచేస్తామని సిర్పూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని మర్తిడి గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా



బెజ్జూరులో సమావేశానికి హాజరైన కాంగ్రెస్ కార్యకర్తలు

రావి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్, అధ్యక్షుడు శంకర్, నాయకులు రాజారామ్, హకీమ్ పాల్గొన్నారు.

జిల్లాలో సాంకేతిక విద్యా సంస్థలను ఏర్పాటు చేయాలి



కలెక్టర్ వినతిపత్రం అందిస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో సాంకేతిక విద్యాసంస్థలను ఏర్పాటు చేయాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు గుండా శ్యామ్, విద్యార్థి నిరుద్యోగ జేఏసీ జిల్లా కన్వీనర్ పొన్న రమేష్, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు అల్లూరి లోకేష్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెనుకబడ్డ జిల్లాలో సాంకేతిక విద్యాసంస్థలను ఏర్పాటు చేయడం వల్ల అనేక మంది పేద విద్యార్థులు చదువుకోడానికి అవకాశం దొరుకుతుందన్నారు. జిల్లాలో 128 ఉన్నత పాఠశాలలున్నాయన్నారు. ప్రతి సంవత్సరం 6425 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. సాంకేతిక విద్యా విధానం జిల్లాలో లేని కారణంగా వేలాది మంది విద్యార్థులు కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ లాంటి ప్రాంతాలకు వెళ్లి చదువులకై రూ.లక్షలు ఖర్చు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని జిల్లాలో పారిశ్రామిక శిక్షణ సంస్థ ఐటీఐ, పాలిటెక్నిక్, అగ్రికల్చర్ డిప్లమా ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన కలెక్టర్ తిర్యాని మండల కేంద్రంలో రూ.2 కోట్లతో పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్, ఎండి ముజంబిల్, ఎస్నం శ్రీకాంత్, రషీద్ పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికలకు రాజకీయ పార్టీలు సహకరించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కడే హేమంత్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాబోవు పార్లమెంట్ ఎన్నికలు జిల్లాలో ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణులతో



పాల్గొన్న రాజకీయ పార్టీల నాయకులు, ఏజెంట్లు



కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబోవు పార్లమెంట్ ఎన్నికలను జిల్లాలో సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఎన్నికలల్లో పోటీ చేసే అభ్యర్థులు భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన ఖర్చుల పరిమితికి లోబడి ప్రచార ఖర్చులు చేయల్సి ఉంటుందన్నారు. ప్రతి ఖర్చును నమోదు చేసి పూర్తి వివరాలను సమర్పించాలన్నారు. సభలు, సమావేశాలు, ప్రకటనలు ఇతరత్రా ప్రచార కార్యక్రమంలో వినియోగించే ప్రతి అంశాన్ని ఎన్నికల నియమావళికి లోబడి నిర్వహించాలని సూచించారు. దీనికి రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఓటర్ల జాబితా రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, రాజకీయ పార్టీల ద్వారా నియమించబడిన ఏజెంట్లు అధికారులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల్లో తనిఖీలు

- ఇద్దరు డీలర్లపై కేసులు : ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాజ్‌కుమార్



నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని రాంనగర్‌కు చెందిన రేషన్ దుకాణం నెంబర్ 15లో విశ్వసనీయ సమాచారంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాజ్‌కుమార్ షాపులో తనిఖీ చేశారు. దుకాణంలో స్టాక్ నిల్వ 39.2 క్వింటాళ్ల బియ్యం తక్కువగా ఉండడంతో సదరు డీలర్ వనపర్తి సునీత, ఆమె భర్త వనపర్తి భాస్కర్‌ను ప్రజల సమక్షంలో ప్రశ్నించారు. 39.2 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని అదే గ్రామానికి చెందిన ముజాయిద్ అలియాస్(ముజ్జు) అనే వ్యక్తికి కిలో బియ్యం రూ.12 చొప్పున అమ్మినట్టు తెలుసుకున్నారు. ప్రభుత్వం పంపిణీ చేసే రాయితీ బియ్యాన్ని ప్రజలకు పంపిణీ చేయకుండా అక్రమంగా దుర్వినియోగానికి పాల్పడిన సదరు డీలర్ వనపర్తి సుజాత, ఆమె భర్త వనపర్తి భాస్కర్‌తో పాటు అక్రమంగా బియ్యాన్ని కొనుగోలు చేసి అక్రమ వ్యాపారానికి పాల్పడిన ముజాయిద్‌పై ఫిక్సెరే కేసు, ఈసీ యాక్ట్ 1955 ప్రకారం కేసు నమోదుచేశారు. డీలర్‌లు పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాజ్‌కుమార్ హెచ్చరించారు. వనపర్తి సునీత డీలర్ నుండి దాదాపుగా 45 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం, ఈపాస్ డివైజర్ కాంటాను సీజ్ చేశామని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం పీడీఎస్ బియ్యం పంపిణీ చేసే ఇట్టి రేషన్‌షాపు బాధ్యతను పీఎఫ్ షాప్ నెంబర్ 14డీలర్ రాంబాబుకు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించామని ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

బినామీ డీలర్‌పై కేసు నమోదు

బెజ్జూరు : మండలంలోని చిన్నసిద్ధాపూర్, కృష్ణపల్లి, గోల్కొండ రేషన్ దుకాణాలను సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ గురువారం తనిఖీ చేశారు. మండలంలోని పెద్దసిద్ధాపూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పొర్తేటి రవి బినామీ డీలర్‌గా వ్యవహరిస్తుండడంతో అతనిపై 6ఏ కేసు నమోదు చేసినట్టు తెలిపారు. చిన్నసిద్ధాపూర్ చౌకధరల దుకాణాన్ని తనిఖీ చేసేందుకు వెళ్లగా సర్పంచ్ రవి ప్రజలకు బియ్యం పంపిణీ చేస్తున్నట్టు పేర్కొన్నారు. బినామీ రేషన్ డీలర్‌గా ఉన్న అతనిపై కేసు నమోదుచేసినట్టు తెలిపారు. అలాగే ఐదు క్వింటాళ్ల బియ్యం తక్కువగా ఉన్నట్టు తెలిపారు. ప్రస్తుతం చిన్నసిద్ధాపూర్ డీలర్ షాపును బెజ్జూరు డీలర్ పురుషోత్తంకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినట్టు తెలిపారు.

పద్మశాలీల అభ్యున్నతికి కృషి



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

పద్మశాలీల అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అన్నారు. పట్టణ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన 2024 క్యాలెండర్లను పద్మశాలి భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పద్మశాలి విద్యార్థుల వసతి గృహ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించి, భవన నిర్మాణానికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. పద్మశాలీలు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా, విద్యాపరంగా ఎదగాల్సిన అవసరముందన్నారు. అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతూ భావితరాలకు స్ఫూర్తి దాయకంగా ఉండాలని, ముఖ్యంగా యువత అన్ని రంగాల్లో ముందుండాలని పేర్కొన్నారు. పట్టణ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు కుడిక్యాల రాజమౌళి, ప్రధాన కార్యదర్శి హనుమండ్ల కేదారి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, బీజేపీ పట్టణ అధ్యక్షులు సిందం శ్రీనివాస్, సంఘం నాయకులు నల్ల కనకయ్య, సామల రాజన్న, సిందం చంద్రయ్య, గడదాసు మల్లయ్య, కటుకం మధుకర్ పాల్గొన్నారు.

లైంగికదాడి కేసులో పదేండ్ల జైలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బాలికపై లైంగికదాడి ఘటనలో నిందితుడికి పదేండ్ల జైలు శిక్ష విధిస్తు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ. రమేష్ తీర్పు ఇచ్చారని కౌటాల సిఐ సాదిక్ పాషా తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. చింతలమానేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 2018లో జరిగిన మైనార్ బాలిపై అత్యాచారం ఘటనలో రవీంద్ర నగర్‌కి చెందిన సత్యజిత్ మండల్ అనే యువకున్నిపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. అప్పటి సీఐలు బి.శ్రీనివాస్, బుద్ధ స్వామి, డి.మోహన్ విచారణ చేశారు. విచారణ అనంతరం సాక్ష్యాదారాలతో ఛార్జిషీట్ దాఖలు చేసి, ఫోక్సో కేసులో పోలీసులు సాక్ష్యులను ప్రవేశపెట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రసాద్ ప్రవేశపెట్టిన సాక్షుల విచారణ అనంతరం కేసు పూర్వపరాలను పరిశీలించిన అనంతరం, నిందితుడికి 420, 376, 417 ఐపీసీ, సెక్షన్ 04 ఫోక్సో చట్టం కింద పదేండ్ల జైలు, రూ.35 వేల జరిమానా విధించారని తెలిపారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషిచేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ సురేష్ కుమార్ అభినందించారు.

హ్యాండ్ బాల్ జూనియర్ బాలికల జట్టు ఎంపిక



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ బాలికల క్రీడా పాఠశాలలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి అండర్-19 జూనియర్ బాలికల హ్యాండ్ బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపిక పోటీలకు ముఖ్య అతిథిగా ఎంపీపీ మల్లికార్జున్ హాజరయ్యారు. ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేష్ మాట్లాడుతూ ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లా నుంచి 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారని, అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన క్రీడాకారులను ఎంపిక చేసినట్టు తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు 15 నుంచి 17 వరకు ఆసిఫాబాద్‌లోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో జరిగే 45వ తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలికల హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మెన్ అలిబిన్ అహ్మద్, ఎస్జీఎఫ్ కార్యదర్శి సాంబశివ రావు, గిరిజన శాఖ క్రీడా అధికారి బండ మీనారెడ్డి, పీఈటీలు రాకేష్, సాయి, వివేక్, కోచ్‌లు సునర్కర్ అరవింద్, సుధీర్, క్రీడాకారులు సంతోష్ పాల్గొన్నారు.

13న పాఠశాల విద్యార్థులకు సైకిల్ రేస్

నవతెలంగాణ-హాజీపూర్

హాజీపూర్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 13న శనివారం జిల్లా స్థాయి సైకిల్ రేస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుగ్గ గట్టు సమీపంలో జాతీయ రహదారి కపిల్ వెంచర్ ముందు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కేవలం పాఠశాల విద్యార్థులు మాత్రమే పోటీల్లో పాల్గొడానికి అర్హులు అన్నారు. అండర్-17 విభాగంలో 9వ ,10 తరగతుల విద్యార్థలకు, అండర్-14 విభాగంలో 7,8వ తరగతులు, అండర్-12లో 5,6వ తరగతులు, అండర్-10లో 3,4 క్లాస్ విద్యార్థులు, అండర్-8 విభాగంలో 1,2వ తరగతి లోపు విద్యార్థులు పాల్గొనాలని తెలిపారు. ప్రతి విభాగంలో మొదటి, రెండవ బహుమతులు ఉంటాయని తెలిపారు. మొదటి బహుమతి రూ.2వేలు, రెండవ బహుమతి రూ.వెయ్యి ఉంటుందన్నారు. పోటీల్లో పాల్గొనే వారు ఎవరి సైకిళ్లను వారే తెచ్చుకోవాల్సి ఉంటుందని సూచించారు. పోటీల్లో పాల్గొనే వారు శనివారం ఉదయం 10 గంటలలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజు లేదని తెలిపారు. పోటీలలో పాల్గొనదలచిన వారు 9908074636 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-మందమర్రి

మందమర్రి ఆదర్శ పాఠశాలలో 2024-25 సంవత్సరానికి 6 నుండి 10వ తరగతిలో ప్రవేశం పొందేందుకు నోటిఫికేషన్ వెలువడింది. ఈ సందర్భంగా మందమర్రి ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ జయకృష్ణారెడ్డి గురువారం పత్రికా ప్రకటన ద్వారా వివరాలు వెల్లడించారు. 6వ తరగతిలో 100 సీట్లు, 7,8,9,10తరగతులలో ఖాళీ సీట్ల కొరకు జనవరి 12 నుండి ఫిబ్రవరి 22వ తేది వరకు 'తెలంగాణఎంఎస్.సీజీజీ.జీఓవీ.ఇన్' వెబ్సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు రుసుము ఓసి విద్యార్థులకు రూ.200, బీసీ, ఎస్సి, ఎస్టీ, పీహెచ్సి, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు రూ.125 నిర్ణయించారు. ఏప్రిల్ 1 నుంచి హాల్ టికెట్లు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఏప్రిల్ 7న 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఉదయం 10:00 నుండి 12:00 గం. వరకు, మిగిలిన తరగతుల విద్యార్థులకు అదేరోజు మధ్యాహ్నం 2:00 నుండి 4:00 గం. వరకు మండల కేంద్రంలో నిర్వహిస్తామన్నారు. నాణ్యమైన ఉచిత విద్య కొరకు విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఆదర్శ పాఠశాల..ఆదర్శమయ్యేనా..?

- వివాదాలతో పాఠశాల ప్రతిష్టకు భంగం
- సిబ్బందితో సఖ్యత లేని ప్రిన్సిపాల్
- తాజాగా అటెండెన్స్ రిజిస్టర్‌పై ఇంకు వివాదం
- ఫిర్యాదు చేసినా స్పందించని ఉన్నతాధికారులు

నవతెలంగాణ-దండేపల్లి

ద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సహకారాలతో ఆరవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుకునేందుకు వీలుగా ఆదర్శ పాఠశాలలు ఏర్పాటు చేశారు. కానీ మండలంలోని లింగాపూర్ ఆదర్శ పాఠశాల దీనికి భిన్నంగా ఉంది. తరచూ వివాదాలతో పాఠశాలలో విద్యార్థులు చదువుకునేందుకు విముఖత చూపుతున్నారు. 2013లో ప్రారంభమైన పాఠశాల 2016 వరకు ఎటువంటి వివాదాలు లేకుండా సజావుగా సాగింది. కానీ 2017 సంవత్సరం తర్వాత తరచూ వివాదాలతో పాఠశాల ప్రతిష్టకు భంగం కలుగుతోంది. 2017 తర్వాత పాఠశాల విద్యార్థుల సంఖ్య కూడా తగ్గుతూ వస్తోంది.

ప్రిన్సిపల్ వ్యవహారంతో తగ్గిన విద్యార్థుల సంఖ్య


ప్రస్తుతం ఉన్న ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ 2017 సంవత్సరంలో బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి పాఠశాలలో ఇబ్బందులు మొదలయ్యాయని విద్యార్థులు తల్లిదండ్రులు చెబుతున్నారు. గత మూడు సంవత్సరాల విద్యార్థుల సంఖ్యను పరిగణలోకి తీసుకుంటే 2021 సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య పాఠశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ విద్యార్థులతో కలిపి దాదాపుగా 700 పైచిలుకు విద్యార్థులు ఉన్నారు. 2022 సంవత్సరంలో ఈ సంఖ్య కాస్త 600 తగ్గింది. ప్రస్తుత విద్యా సంవత్సరానికి పాఠశాల విద్యార్థులు, ఇంటర్మీడియట్



విద్యార్థులు కలిపి కేవలం 539 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ప్రిన్సిపాల్ తీరు నచ్చకనే తమ పిల్లల్ని పాఠశాలలో చేర్పించడం లేదని విద్యార్థుల తండ్రులను ఆరోపిస్తున్నారు.

తరచూ వివాదాలే..!

గతంలో ప్రిన్సిపల్ పై చాలావరకు ఆరోపణలు ఉన్నాయి. విద్యార్థులకు పాఠశాలలో మత బోధనలు చేస్తున్నారని గతంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టారు. ప్రభుత్వం నుంచి సరఫరా అయ్యే యూనిఫామ్స్ కాకుండా ప్రత్యేకంగా డ్రెస్ కోడ్ ఉండాలని ఒక్కో విద్యార్థి నుంచి సుమారు రూ.2 వేలు వసూలు చేసి విద్యార్థులకు డ్రెస్సులు ఇవ్వకపోవడంతో వారి తల్లిదండ్రులు ఆందోళన చేయగా విషయం బయటకు తెలవడంతో ఎవరి డబ్బులు వాళ్లకు ఇచ్చినట్లు సమాచారం. పాఠశాలకు సంబంధించిన సిబ్బంది వేతనాలు, నిధులను తన సొంత



లవసరాలకు వాడుకున్నారని పాఠశాల సిబ్బంది బహిరంగంగానే ప్రిన్సిపాల్‌తో గొడవకు దిగారు. ఈ విషయం జిల్లా ఉన్నత విద్యా శాఖ అధికారుల వరకు వెళ్లేసరికి వారి ఆదేశాలతో మళ్లీ పాఠశాల ఖాతాలో డబ్బులు జమ చేయగా అవివాదం సద్దుమణిగింది.

తాజాగా సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్‌పై ఇంకు వివాదం

పాఠశాల సిబ్బంది హాజరు పట్టికపై ఇంకు పడడంతో సిబ్బంది మధ్య విభేదాలు మళ్లీ బయటపడ్డాయి. ప్రిన్సిపాల్ తన సెలవు దినాలను హాజరు పట్టికలో మార్చి సెలవు పెట్టిన రోజులను కూడా వచ్చినట్లు చూపడంతో కొంతమంది సిబ్బంది సూటిగా ప్రశ్నించినట్లు సమాచారం. దీంతో ప్రిన్సిపల్ రిజిస్టర్‌పై ఇంక్ ఎలా పడిందో తనకు తెలియదని పాత రిజిస్టర్ స్థానంలో కొత్త రిజిస్టర్ పెడదామని అనడంతో సిబ్బంది విభేదించారు. ఈ విషయం కాస్త సిబ్బంది ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చేశారు. కేవలం ప్రిన్సిపల్ చేసిన తప్పుకు తామెందుకు బలి కావాలని బహిరంగంగానే అధికారులకు ఫిర్యాదు చేశారు. రిజిస్టర్‌పై ఇంక్ ఎలా పడిందని నవతెలంగాణ సీసీ కెమెరాలు పరిశీలించాలని కోరగా సీసీ కెమెరాలు పని చేయడంలేదని సమాధానం చెప్పడం కొసమెరుపు. హాజరు పట్టికపై ఇంక్ వివాదం గత నెలలో జరిగింది.

విచారణ చేపట్టిన విద్యాశాఖ ఉన్నతాధికారులు

హాజరు పట్టికపై ఇంకు పడిన విషయం గత నెలలో పాఠశాల సిబ్బంది విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేయగా గురువారం రాష్ట్ర విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ పి.సరోజిని దేవి విచారణ చేపట్టారు. సమగ్ర నివేదికను తదుపరి చర్యలకు స్కూల్ ఆఫ్ డైరెక్టర్ ఎడ్యుకేషన్ అందజేశారు.



ఉన్నతాధికారులకు నివేదించాం

కాసుల రవీందర్, ఎంఈఓ

రిజిస్టర్‌పై ఇంక్ పడిన వివాదంపై నా దృష్టికి వచ్చింది. ఈ విషయంపై ఆరా తీసి సిబ్బందిని మందలించడం జరిగింది. నివేదికను ఉన్నతా అధికారులకు అందజేశాం. విచారణకు వెళ్ళిన సమయంలో ప్రిన్సిపల్ లేకపోవడంతో హాజరు పట్టికను పరిశీలించాను. సీసీ కెమెరాలుపై ఆరా తీయగా పనిచేయడం లేదు. బాధ్యులపై చర్యలకు నివేదించాం. సిబ్బంది మధ్య సఖ్యత లేకపోవడంతో తరచూ వివాదాలు జరుగుతున్నాయని తెలుస్తోంది.

కొంతమంది సిబ్బంది కావాలని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు

అనీల : ప్రిన్సిపాల్

సిబ్బంది హాజరు పట్టికపై ఇంకు ఎలా పడిందో తనకు తెలియదు. కొంతమంది సిబ్బంది కావాలని నన్ను ఇబ్బందికి గురి చేస్తున్నారు. హాజరు పట్టికలో తన సెలవులను దిద్దుబాటు చేసేందుకు ప్రయత్నం చేశాననడం సరికాదు. సిబ్బంది కొంతమంది కావాలనే తమపై తప్పుడు ఆరోపనలు చేస్తున్నారు.

సింగరేణి నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-మందమర్రి

సింగరేణి నూతన సంవత్సర క్యాలెండర్‌ను మందమర్రి ఏరియా జీఎం మనోహర్ తన కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ నూతన క్యాలెండర్‌ను ఏరియాలోని గనులు డిపార్ట్మెంట్ కార్యాలయాల్లో పనిచేయు అధికారులకు ఉద్యోగులకు అందజేస్తామని తెలిపారు. సంస్థ సాధించిన అభివృద్ధి పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం, ఉద్యోగుల సంక్షేమం, సింగరేణిలో ఉన్నటువంటి అత్యాధునిక యంత్రాల ఫోటోలతో రూపొందించిన క్యాలెండర్ ద్వారా మన సంస్థ సాధిస్తున్న అభివృద్ధి ప్రతి ఒక్కరికీ తెలిసేలా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూజీఎం ఏ రాజేశ్వర్ రెడ్డి, గుర్తింపు సంఘం నాయకులు సలేంద్ర సత్యనారాయణ, ఏజీఎం ఈ అండ్ ఎం నాగరాజు, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, శాంతిఖని ఏజెంట్ విజయప్రసాద్, ఎస్ ఈ ఏరియా స్టోర్ హైడిశ్వర్, డీవైపీఎం ఎండీ ఆసిఫ్ పాల్గొన్నారు.

నస్పూర్ : శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఏరియా జీఎం బి సంజీవరెడ్డి సింగరేణి నూతన క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణిలో అందరికీ ప్రేరణ కలగేలా సంస్థ సాధిస్తున్న బహుముఖ ప్రగతికి సంక్షేమానికి సామాజిక సేవకు ప్రతీకగా ఈ నూతన క్యాలెండర్ రూపొందించబడిందన్నారు. ఈ క్యాలెండర్ ప్రతి ఉద్యోగిలో నూతన ఆనందాన్ని నింపుతుందని ఇదే ఉత్సాహంతో ఏడాది కూడా ఏరియాకు కేటాయించిన బొగ్గు లక్ష్యాలను రక్షణతో సాధించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం రఘు కుమార్, డీజీఎం పర్సనల్ పి.అరవింద రావు, డీజీఎం ఐఈడీ చిరంజీవులు, ఎస్టేట్స్ ఆఫీసర్ వరలక్ష్మి, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వరరెడ్డి, డీవై పీఎంలు రాజేశ్వరరావు, రాజేష్, దేవేందర్‌రెడ్డి, సీనియర్ పీఓ పి.కాంతారావు పాల్గొన్నారు.

కడెం ప్రాజెక్టుకు నిధులు కేటాయించడం అభినందనీయం

నవతెలంగాణ-జన్నారం

కడెం ప్రాజెక్టు మరమ్మతులకు రూ.5.5 కోట్ల నిధులు కేటాయించడం అభినందనీయమని రైతు సమితి మండల అధ్యక్షుడు అల్లం లచ్చన్న అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన పత్రిక విలేకరులతో వారు మాట్లాడుతూ గత పాలకులు కడెం ప్రాజెక్టును పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, కడెం ప్రాజెక్టు మరమ్మత్తులు చేయించడానికి పూనుకోవడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి మంత్రి, ఎమ్మెల్యేలను కడెం ఆయకట్టు రైతులు రుణపడి ఉంటారన్నారు.

ఉద్యోగోన్నతి పత్రాల అందజేత

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియా జీఎం కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు వరప్రసాద్, శ్రీమతి లక్ష్మికు ఎస్ఎల్పి, టైం బాండ్ ప్రమోషన్స్‌ను జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి చేతుల మీదుగా గురువారం అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలో 342 మంది ఉద్యోగులు అర్హత కలిగి ఉన్నారని వారికి వారి సంబంధిత గనులు, విభాగాలకు ఉత్తర్వులు అందజేశామని తెలిపారు. ప్రతి సంవత్సరం జనవరి నెలలో టైం బాండ్ ప్రమోషన్స్ అందజేస్తున్నామని అలాగే వీరికి రావలసిన ప్రయోజనాలను జనవరి నెల జీతం నుంచి అందుతాయని, ఉద్యోగులు అంకితభవంతో పనిచేయాలని తమ విధుల్లో నైపుణ్యాన్ని పెంచుకోవాలని అలాగే రక్షణను దృష్టిలో ఉంచుకొని పనిచేయాలని, సంస్థకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. అలాగే పదోన్నతులు పొందిన ఉద్యోగిని ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం రఘు కుమార్, డీజీఎం పర్సనల్ పి.అరవిందరావు, డీజీఎం ఐఈడీ చిరంజీవులు, ఎస్టేట్స్ ఆఫీసర్ వరలక్ష్మి క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వరరెడ్డి, డీవై.పీఎంలు రాజేశ్వరరావు, రాజేష్, దేవేందర్‌రెడ్డి, సీనియర్ పీఓ పీ.కాంతారావు పాల్గొన్నారు.

సీఐటీయూ కృషి ఫలితంగా ఈఎస్ఐ సౌకర్యానికి చర్యలు

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం(సీఐటీయూ) చేసిన కృషి ఫలితంగా కార్మికులకు ఈఎస్ఐ సౌకర్యం కల్పించేందుకు చర్యలు ప్రారంభమయ్యాయని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు తెలిపారు. గురువారం హైదరాబాద్ ఈఎస్ఐ రీజినల్ డైరెక్టర్ కార్యాలయ అధికారి టి.ప్రశాంత్, వరంగల్ బ్రాంచ్ మేనేజర్ జి. సాయిల బృందం కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయాన్ని సందర్శించి సింగరేణి వ్యాప్తంగా ఉన్న కాంట్రాక్టు కార్మికుల వివరాలను సేకరించారు. సింగరేణి డిప్యూటీ జనరల్ మేనేజర్ పర్సనల్ డి.వరప్రసాద్, ఇతర పర్సనల్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తగూడెం పర్యటనకు వచ్చిన ఈఎస్ఐ బృందాన్ని సింగరేణి కాంటాక్ట్ కార్మికుల సంఘం (సీఐటీయూ) ప్రతినిధి బృందం కలిసి కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్ఐ సౌకర్యాన్ని కల్పించేందుకు కృషిని ప్రారంభించినందుకు ధన్యవాదాలు తెలిపారు.



2022 సెప్టెంబర్‌లో జరిగిన 18 రోజుల సమ్మె సందర్భంగా సింగరేణి యాజమాన్యం కార్మిక సంఘాలతో చేసిన ఒప్పందంలో ఈఎస్ఐ సదుపాయాన్ని కల్పించేందుకు అంగీకరించిందని, సింగరేణి డైరెక్టర్ (పా)ను అనేకసార్లు కలిసి ఒత్తిడి తేవడం జరిగిందన్నారు. ఫలితంగా సింగరేణి యాజమాన్యం 26 నవంబర్ 2023న ఈఎస్ఐ రీజినల్ డైరెక్టర్‌కి లేఖను రాసిందని, ఈఎస్ఐ రీజినల్ అధికారులు సింగరేణిలో ఈఎస్ఐ అమలుకు అనుమతి కోరుతూ ఢిల్లీకి లేఖ రాశారని పేర్కొన్నారు. ఈ ప్రతినిధి బృందంలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం కొత్తగూడెం బ్రాంచ్ కార్యదర్శి డి.వీరన్న, బ్రాంచ్ అధ్యక్షులు జి.శ్యామ్‌కుమార్, తాజుద్దీన్, శ్రీను, పవన్ ఉన్నారు.

సదుపాయాల కల్పనకే గ్రామ అభివృద్ధి ప్రణాళికలు

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో గ్రామ, మండల, జిల్లా స్థాయిలలో ప్రాథమిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా గ్రామ అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్‌లో కలిసి గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, మండల అభివృద్ధి ప్రణాళిక, జిల్లా అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి ప్రక్రియను ప్రణాళిక బద్ధంగా నిర్వహించాలని, గ్రామపంచాయతీ, మండల, జిల్లా స్థాయిలలో ప్రణాళిక రూపొందించే సమయంలో అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఆయా స్థాయిలలో అవసరాలను గుర్తించి నిధులను కేటాయిస్తూ ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. పారిశుధ్యం,



పాఠశాలలు, అంగన్‌వాడీల్లో ప్రాథమిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నరేందర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి బి. శేషాద్రి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, జిల్లా అధికారులు, డివిజనల్ పంచాయతీ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావేదిక

నవతెలంగాణ-లక్షెట్టిపేట

ఉపాధిహామీ పథకం 2020-2023 సంబంధించిన సామాజిక తనిఖీలో భాగంగా గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో అడిషనల్ డీఆర్డీఓ ఆధ్వర్యం ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీల్డ్ స్థాయిలో సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎస్ఎంఎంఎస్ అటెండన్స్ డిమాండ్ తీసుకొనడంలో అక్రమాలు జరిగితే సహించేది లేదని సిబ్బందిని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ కిరణ్, శివరాం, అంబుడ్స్ పర్సన్ ఎస్జిఎమ్ నరేందర్, ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, ఏపీఓ వెంకటరమణ, ఎంపీపీ అన్నం మంగ, జడ్పీటీసీ సత్తయ్య, ఎస్ఆర్పీలు సాయిలు, భగవంతరావు, డీఆర్పీలు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



రెండో విడత గొర్రెలు పంపిణీ చేపట్టాలి



నవతెలంగాణ-జన్నారం

యాదవులకు రెండవ విడతలోని వారందరికీ గొర్రెలు పంపిణీ చేయాలని యాదవ సంఘం జన్నారం మండల అధ్యక్షుడు బొంతల మల్లేష్ యాదవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గొట్ల రాజేష్ యాదవ్ అన్నారు. గురువారం మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణ కేంద్రంలో నిర్వహిస్తున్న యాదవ సంఘం సమావేశానికి మండల కేంద్రం నుంచి యాదవులు భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాదవులు ఐక్యంగా ఉండి పోరాటం చేస్తేనే తమ హక్కులను సాధించుకోవచ్చున్నారు. ప్రభుత్వం గొర్రెల పంపిణీ త్వరగా చేపట్టాలని కోరారు. యాదవ సంఘం నాయకులు గురువయ్య యాదవ్, నరేష్ యాదవ్, మల్లేష్ యాదవ్, రామన్న, లింగన్న, లక్ష్మణ్ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు అపరిమిత ఉచిత వైద్య సేవలు అందించాలి



నవతెలంగాణ-జైపూర్

సింగరేణి సంస్థలో వివిధ డిపార్ట్మెంటుల నుంచి పదవీ విరమణ పొందిన విశ్రాంత ఉద్యోగులకు యాజమాన్యం అపరిమితంగా ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలని ఆ సంఘం నాయుకులు కోరారు. సింగరేణి సీఎండీగా బాధ్యతలు చేపట్టిన బలరామ్‌ను గురువారం సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు దండంరాజు రాంచందర్, ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణుమాదవ్, ఉపాధ్యక్షులు కంచ బీరాయ్యతో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సింగరేణి ఆస్పత్రుల్లో సీపీఆర్ఎస్ మెడికల్ కార్డులో నిమ్స్ టారీఫ్‌లో 40 శాతం కోత విధించరాదని ఈ సందర్భంగా సీఎండీ బలరామ్‌కు ఇచ్చిన వినతి పత్రంలో కోరారు. సింగరేణి ఉద్యోగులుగా సంస్థ అభివృద్ధికి పాటుపడుతూ పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సమస్యల పట్ల యాజమాన్యం సానుకూలంగా స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ నర్సింగరావు, కనకయ్య, ఎస్ఎస్ఎస్వీ ప్రసాద్, పూర్ణ ప్రకాష్, జయంత్ కుమార్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న హెచ్ఎంకు సన్మానం



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ముత్యంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం హెచ్ఎంగా పని చేసి బదిలీపై దేవాపూర్‌కు వెళ్లిన రాథోడ్ రమేష్‌కు ఘనంగా సన్మానం చేశారు. పూలమాలలతో, శాలువాలతో జ్ఞాపకాలు అందించి ఘనంగా సన్మానం చేశారు. నూతన హెచ్ఎం వెంకటేశ్వరస్వామి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముత్యంపల్లి హెచ్ఎంగా పని చేసిన రాథోడ్ రమేష్ చేసిన సేవలను ఉపాధ్యాయులు, విద్యార్థులు తమ అభిప్రాయాలను తెలిపారు. అనంతరం నూతన హెచ్ఎంగా వచ్చిన వెంకటేశ్వరస్వామిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ వాసాల ప్రభాకర్ హాజరై మాట్లాడుతూ ఉద్యోగుల్లో బదిలీలు సహజమని, కాని కష్టపడ్డ ఉద్యోగులకు ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం ఎంఈఓ వాసాల ప్రభాకర్‌ను సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం సాంబ మూర్తి, ఉపాధ్యాయులు పుష్ప లత, బండ శాంకరి, కృష్ణ, గోపాల్ రావు, జ్యోతి, మాధవిలత, అర్చన, సీఆర్పీ మంతెన రమేష్, పాల్గొన్నారు.

మండల స్థాయి క్రికెట్ పోటీలో రికార్డ్ స్కోర్

నవతెలంగాణ-హాజీపూర్

మండల స్థాయి క్రికెట్ లో రికార్డ్ స్థాయి పాట్నర్ షిప్ రన్స్ స్కోర్ చేశారు దోనబండ టీమ్, హాజీపూర్ మండలంలోని గుడిపేట్‌లో దివంగత రాసమళ్ళ అశోక్ గౌడ్ స్మారకార్థం నిర్వహిస్తున్న మండల స్థాయి క్రికెట్ పోటీల్లో బాగంగా గురువారం దొనబండ, రాంపూర్ గ్రామల మధ్య పోటీ జరగగా మొదట బ్యాటింగ్ చేసిన దొన బండ టీమ్ 10 ఓవర్లలో 163 రన్స్ స్కోర్ చేసింది. ఇందులో రాము, రాకేష్‌లు 47 బాల్స్‌లో 138 రన్స్ పార్ట్‌నర్ షిప్ నమోదు చేశారు. రాము 32 బాల్స్‌లో 92, రాకేష్ 15 బంతుల్లో 46 పరుగులు చేశారు.

పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పలు ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలల్లో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. తెలుగుదనం ఉట్టి పడేలా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి సంక్రాంతి సందడి చేశారు. విద్యార్థినులు పాఠశాల ఆవరణలో చూడముచ్చటగొలిపే రంగవల్లులు వేసి ఆకట్టుకున్నారు. గాలిపటాలు తయారు చేసి ఎగురవేశారు. హరిదాసుల వేషాధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కలమడుగులోని వివేకానంద ప్రయివేటు పాఠశాల మండల కేంద్రంలోని స్లేట్స్ లిటిల్ హాండ్స్, జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో, కేజీబీవీ కిష్టాపూర్ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి పండగ సంబరాలు నిర్వహించారు. నేటితో పాఠశాలలకు సెలవు దినం కావడంతో, ఈ ముందస్తు సంక్రాంతి పండగ సంబరాలను నిర్వహించడం జరిగిందని ఆయా పాఠశాల నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల నిర్వాహకులు, వివేకానంద పాఠశాల ప్రిన్సిపల్ సతీష్ గౌడ్ స్లేట్ పాఠశాల ప్రిన్సిపల్ ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి, లిటిల్ హాండ్స్ ప్రయివేట్ పాఠశాల కరస్పాండెంట్ ఎర్ర సంపత్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఏనుగు సుభాష్‌రెడ్డి అల్లం లచ్చన్న పాల్గొన్నారు.

ఘనంగా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడి జన్మదినం

నవతెలంగాణ-లక్షెట్టిపేట

కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ ఆరిఫ్ జన్మదిన వేడుకలను గురువారం పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఆరిఫ్‌తో కేక్ కట్ చేయించి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యువ నాయకులు మహమ్మద్ సల్మాన్, సయ్యద్ హాది, పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్

ముందస్తు సంక్రాంతి వేడుకలు

నవతెలంగాణ-లక్ష్మణచాంద



మండల కేంద్రంలోని వాణి పాఠశాలలో ప్రిన్సిపాల్ పి.గంగాధర్ ఆధ్వర్యంలో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వేడుకలు, నృత్యాలు పలువురిని అలరించాయి. చిన్నారులు గాలి పటాలు ఎగురేస్తూ కేరింతలు వేశారు. విద్యార్థిని, విద్యార్థులకు సంక్రాంతి పండుగ, సాంప్రదాయాల గురించి తెలియజేసేందుకు ముందస్తు వేడుకలు నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్రాంతి పండుగకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

సంక్రాంతి పండగను పురస్కరించుకొని ఆర్టీసీ ప్రయాణికులకు ఆర్టీసీ శుభవార్త తెలిపింది. పండుగను పురస్కరించుకుని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్టీసీ రీజియన్ ఆధ్వర్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం కోసం హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు ఆర్టీసీ ఆర్ఎం సోలేమాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్‌కు 68, నిర్మల్ 110, ఆసిఫాబాద్ 48, మంచిర్యాల 94, ఉట్నూర్ 8 బస్సులను నడుపుతున్నట్టు పేర్కొన్నారు. ఈ ప్రత్యేక బస్సులలో మహాలక్ష్మి పథకం వర్తించే ప్రయాణికులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఆర్టీసీ ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్టీసీని ఆదరించాలని కోరారు.

మంగాయి సందీప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యావాలంటీర్ నియామకం

నవతెలంగాణ-లోకేశ్వరం

విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమన్న అంబేద్కర్ కలలు నెరవేరాలంటే ప్రతి విద్యార్థి పట్టుదలతో చదివి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నానని మంగాయి సందీప్ ఫౌండేషన్ చైర్మెన్ మంగాయి సందీప్‌రావు అన్నారు. గురువారం లోకేశ్వరం మండలంలోని బిలోలి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో తమ సొంత నిధులను కేటాయించి, విద్యా వాలంటీర్‌ని నియమిస్తూ ముందుగా రెండు నెలలకు గాను రూ.10వేల నగదు అందజేయడం జరిగిందని తెలిపారు. విద్యా వాలంటీర్‌ని పాఠశాల సమయంలో పాఠాలు చెప్పడంతో పాటు ఆసక్తి ఉన్న విద్యార్థుల కోసం సాయంకాల సమయంలో ట్యూషన్ చెప్పించడం జరుగుతుందని అన్నారు. మారుమూల ప్రాంతాల్లో విద్యారంగ అభివృద్ధి కోసం ఇలాంటి సేవలు ఇంకా ఎన్నో చేసేలా మా ఫౌండేషన్‌ని దీవించాలని ఫౌండేషన్ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సవిత నర్సింగ్‌రావ్, గ్రామ వీడీసీ సభ్యులు కాంతారావ్, పాఠశాల కమిటీ సభ్యులు వాహిద్, సాయిలు, మంగాయి ఫౌండేషన్ సభ్యులు మంగాయి నర్సింగ్‌రావ్, షేక్ అహ్మద్, షఫీ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సొంతగూటికి కొట్నాక విజయ్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అసెంబ్లీ ఎన్నికల్లో తనకు నియోజకవర్గ టికెట్ కేటాయించలేదని బీజేపీకి రాజీనామా చేసి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన కొట్నాక విజయ్ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి సూచన మేరకు ఆయన సమక్షంలో తిరిగి ఆ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లో కేంద్రమంత్రి కిషాన్ రెడ్డిని కలిసి కండువ కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు టికెట్ కేటాయించలేదనే బాధతో పార్టీ వీడానని రాష్ట్ర అధ్యక్షుడు సూచన మేరకు తిరిగి పార్టీలో చేరినట్లు వివరించారు. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. ఇదిలా ఉంటే బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆత్మరామ్ నాయక్ 1500 ఓట్లు రాగ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన విజయ్‌కి గత ఎన్నికల్లో 16,000 పైగా ఓట్లు వచ్చిన విషయం తెలిసిందే. విజయ్ చేరికతో మరోసారి నియోజకవర్గంలో బీజేపీ బలం పుంజుకోవడానికి ప్రయత్నం చేస్తుంది.

లిటిల్ స్టార్‌లో ఘనంగా సంక్రాంతి వేడుకలు

నవతెలంగాణ-లక్షెట్టిపేట



లక్షెట్టిపేటలోని లిటిల్ స్టార్ పాఠశాలలో ముందస్తుగా సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలలో భాగంగా భోగి మంటలు, బొమ్మల కొలువు నిర్వహించారు. దీన్ని ఉద్దేశించి పాఠశాల కరస్పాండెంట్ సంతపురి కిషోర్‌కుమార్ మాట్లాడారు. పాఠశాలలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థులకు పండుగల యొక్క విశిష్టత తెలుస్తుందన్నారు. అలాగే వాతావరణానికి అనుగుణంగా వారి అలవాట్లను మార్చుకోవడానికి ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు మహమ్మద్ హమీద్, మినుముల శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాసిపేట : మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలను నిర్వహించగా విద్యార్థులు, మహిళా ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని వివిధ రంగులలో ముగ్గులను వేశారు. పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అందె నాగమల్లయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్ : మావల మండలంలోని వాఘపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటే విధంగా చేశారు. విద్యార్థినులు అందమైన రంగు వల్లులతో పాఠశాల క్రీడా ప్రాంగణం ముత్యాల ముగ్గులతో అందరినీ ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దారు. ఇలాంటి కార్యక్రమాలు చేయడం వలన రాబోయే రోజులలో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగే దిశగా ఉపాధ్యాయుల చక్కటి బోధనతో విద్యార్థుల ఉన్నతికి కృషి చేస్తున్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాలు చేసిన జీవశాస్త్ర ఉపాధ్యాయుడు సీహెచ్ రమేష్‌బాబు, పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు ప్రవీణ్ కుమార్, ప్రతాప్, ఖయ్యూం, ప్రేమ్ సింగ్, రవీందర్, పార్వతి పాల్గొన్నారు.

ప్రభావిత గ్రామాల్లో అభివృద్ధి చేయాలని వినతి

నవతెలంగాణ-కాసిపేట

సింగరేణి ప్రభావిత గ్రామాల్లో అభివృద్ధి చేయాలని సింగరేణి సీఅండ్ఎండీ బలరాం నాయక్‌కు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రత్నం ప్రదీప్ వినతిపత్రం అందించారు. హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అనతరం వినతిపత్రం అందించారు. మండలంలో ఉన్న రెండు భూగర్భ గనులు, ఓపెన్ కాస్ట్ ఉందని, అభివృద్ధి లేదని తెలిపారు. సింగరేణి ఆధ్వర్యంలో ముత్యంపల్లి క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేయడంతో పాటు ఓపెన్ జిమ్, గ్రంథాలయం ఇతర సదుపాయాలు కల్పించాలని కోరారు. సీఅండ్ఎండీ సమస్యలపై సానుకూలంగా స్పందించినట్లు ఆయన పేర్కొన్నారు.

పర్ధాన్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-బేల

మండల అఖిల భారతీయ ఆదివాసీ పర్ధన్ హక్కుల పోరాట సమితి నూతన కార్యవర్గా న్ని గురువారం స్థానిక రాంమందిరంలో ఎన్నుకున్నారు. దీనికి మండలంలోని వివిధ గ్రామాల పర్ధాన్ కులస్తులు హాజరయ్యారు. అధ్యక్షుడిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల పర్ధాన్ ప్రధాన కార్యదర్శి పూసం రాజేశ్వర్ మాట్లాడుతూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అందరికి మేలు జరిగేలా చూడాలని పేర్కొన్నారు. ముఖ్యంగా పర్ధాన్ కులస్తులను పివిటిజిలో చేర్చేలా ఐటీడీఏ పీఓను కలిసి కోరుదామని తెలిపారు. సంఘం అధ్యక్షుడు నైతం సీతారామ్, గౌరవ అధ్యక్షుడు మెస్రం భారత్, ఉపాధ్యక్షులు కనాకే సంజయ్, ప్రధాన కార్యదర్శి పూసం రాజేశ్వర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

18న తుడుం దెబ్బ మండల కమిటీ ఎన్నికలు

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలో 18న మండలకమిటీ ఏర్పాటుకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తుడుం దెబ్బ డివిజన్ అధ్యక్షుడు కనక ప్రభాకర్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. 18న మండల కేంద్రంలో ఆదివాసీ తుడుం దెబ్బ అనుబంధ సంఘాల మండల కమిటీ ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. సంఘ బాధ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు అడ మానిక్‌రావ్, నాయకులు శ్రీరామ్, సాగర్, ఆనంద్‌రావు, జిల్లా విద్యార్థి సంఘం అధ్యక్షుడు పెందూర్ దాదిరావు, కార్యదర్శి ఆత్రం జలీంషావ్, జై భారత్ జిల్లా అధ్యక్షుడు పెందూర్ దీపక్, మెస్రం చందర్‌షావ్, పూసం రాము ఉన్నారు.

సేవాలాల్ మహారాజ్ అడుగుజాడల్లో నడవాలి

- గురు మిలన్ దివస్‌లో జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్
- హాజరైన ఎమ్మెల్యేలు బొజ్జు పటేల్, అనిల్ జాదవ్



నవతెలంగాణ-నార్నూర్

సేవాలాల్ మహారాజ్ అడుగు జాడలో నడవాలని జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్ అన్నారు. గురువారం మండలంలోని కొత్తపెల్లి-హెచ్ దీక్ష భూమిలో 45వ గురు మిలన్ దినోత్సవం సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా దీక్ష గురు ప్రేమ్‌సింగ్ మహారాజ్ ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మెన్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ అడుగుజాడల్లో నడుస్తూ బాపు రామారావ్ మహారాజ్ ఆచరణలో యువత సమాజ సేవలో ముందుండాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో బంజారాల కాశీగా ప్రసిద్ధి గాంచిన సేవాలాల్ దీక్ష భూమిని అధికారికంగా ప్రకటించాలని బంజారా సమాజ్ తరుపున డిమాండ్ చేశారు. దేశంలో ఉన్న బంజారా భక్తులు దీక్ష భూమికి దర్శనానికి వస్తారని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆలయ నిర్మాణం, అభివృద్ధికి రూ.100కోట్లు నిధులు మంజూరు చేయాలని కోరారు. మహోత్సవానికి వచ్చిన భక్తులకు ఆయన అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బోథ్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు అనిల్ జాధవ్, వెడ్మ బొజ్జు పటేల్, డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజ రెడ్డి, మాజీ మంత్రి గోడం నగేష్, ఆదిలాబాద్ అదనపు కలెక్టర్ శ్యామల దేవి, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం అధ్యక్షులు అమర్ సింగ్ తిలావత్, ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత రాథోడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు యునీస్ అక్బానీ, ఆలయ కమిటీ అధ్యక్షుడు రెడ్డి జాదవ్, సర్పంచ్ రాథోడ్ సుభద్ర రామేశ్వర్, వివిధ పార్టీల నాయకులు, బంజారా సమాజ్ పెద్దలు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞశాలి ఊరే గణేష్



నవతెలంగాణ- ఆదిలాబాద్ అర్బన్

పట్టణంలోని చించర్‌వాడకు చెందిన కళాకారుడు ఊరే గణేష్ బహుముఖ ప్రజ్ఞశాలిగా అందరి చేత శభాష్ అనిపించుకుంటున్నాడు. తనదైన శైలిలో చిత్రాలను గీస్తూ చిత్రకారుడిగా, ఆధ్యాత్మికత ఉట్టిపడేలా అందమైన విగ్రహాలను రూపొందిస్తూ, ఒక విశిష్ట కళాకారుడిగా జిల్లాకే తలమానికం అయ్యారు. విగ్రహాలను తయారు చేయడంలో ఆయనది అందవేసిన చేయి. అతని చేతిలో రూపుదిద్దుకున్న దుర్గామాత, వినాయక విగ్రహాలకు ఉమ్మడి జిల్లాలో సైతం మంచి డిమాండ్ ఉండటం విశేషం. ఒకవైపు ప్రభుత్వ పాఠశాలలో ఒప్పంద ఆర్ట్ టీచర్‌గా సేవలందిస్తూనే, అందమైన అనేక విగ్రహాలకు ప్రాణం పోస్తున్నాడు. ఇటీవల ఆయన తయారు చేసిన గణపతి విగ్రహం రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద వినాయక విగ్రహంగా పరిగణించబడటం అతని పనికి నిదర్శనం. విగ్రహాలను తయారు చేస్తూనే మరోవైపు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. పట్టణ యువజన సంఘాల సమితికి అధ్యక్షుడిగా నాయకత్వం వహిస్తూ రక్తదాన, నేత్రదాన కార్యక్రమాలను చేపడుతున్నారు. స్థానిక డైట్ మైదానం ఎదురుగా ఇటీవలే 25 అడుగుల భారీ వివేకానంద విగ్రహాన్ని సైతం తయారు చేసి తన సత్తా ఏంటో చాటారు. ఒకవైపు ఒక కళాకారుడిగా కలలకు జీవం పోస్తూ, మరోవైపు యువజన సంఘాల సమితి నాయకుడిగా యువతకు నాయకత్వం వహిస్తూ ఆదర్శవంతంగా నిలుస్తున్నారు.



రహదారి పనుల్లో అధికారుల పర్యవేక్షణ ఎక్కడ..?

- ఇష్టారీతిన కాంట్రాక్టర్ పనులు
- నాణ్యత పాటించని వైనం
- మాములుగా తీసుకుంటున్న అధికారులు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



రహదారి పనుల్లో అధికారుల పర్యవేక్షణ లేని కారణంగా సంబంధిత కాంట్రాక్టర్ ఇష్టరీతిన పనులు చేపడుతున్నాడు. నాణ్యత ప్రాణాలు లేకుండా పనులు కొనసాగుతున్నాయి. పర్యవేక్షించాల్సిన అధికారులు కూడా ఇటు వైపు చూడకపోవడంతో పనులు నాసిరకంగా సాగుతున్నాయి. మండలంలోని కేస్లాగూడ నుంచి ఏమాయిటకుంట వరకు కోటి రూపాయలతో తారు రోడ్డు పనులు మంజూరయ్యాఇ. ఈ పనులను ఆర్అండ్‌బీ శాఖ ద్వారా చేపడుతున్నారు. అధికారులు అండదండతో సంబంధిత కాంట్రాక్టరే పర్యవేక్షించుకుంటు పనులను తనకు అనుకులంగా, లాభం జరిగేల చేస్తున్నాడు. రోడ్డు నిర్మాణం చేసే సమయంలో అధికారులు అక్కడుండి నాణ్యత ప్రమాణాలు పరిశీలించారు. కానీ అలాంటేవి ఇక్కడ కనిపించలేదు. బుధవారం నుంచి తారు రోడ్డు పనులు ప్రారంభమైన సంబంధిత శాఖ ఇంజనీర్లు ఇటు వైపు చూడలేదు. అధికారులతో కుమ్మక్కైన గుత్తేదారుడు ఇష్టరీతిన పనులు చేపడుతున్నాడు. అధికారులు కూడా మాములుగా తీసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. గిరిజన ప్రాంతంలో వేస్తున్న ఇలా నాణ్యత లేకుండా వేయడం పట్ల పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంభందిత ఉన్నతాధకారులు ఈ రోడ్డు పనులపై దృష్టి సారించాలని కోరుతున్నారు. ఇదే విషయమై ఆర్అండ్‌బీ ఏఈ ఆరవింద్‌ను వివరణ కోసం ఫోన్ చేయగా స్పందించలేదు.

13లోగా న్యాయ మహా అభియాన్‌ను పూర్తి చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకం ద్వారా బలహీన గిరిజన సమూహాలను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావాలనే లక్ష్యంతో జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ క్యాంపులను ఈ నెల 13వ తేదీలోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని పెంబి, కడెం, ఖానాపూర్, మామడ, నిర్మల్ రూరల్, సొన్, సారంగాపూర్ మండలాల్లో గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న ఆధార్ ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జన్‌మన్ పథకం ద్వారా గిరిజనుల అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో ప్రతి గిరిజనుడికి ఆధార్ కార్డును అందించే ప్రయత్నాలను జిల్లా యంత్రాంగం ముమ్మరం చేసిందని తెలిపారు. జిల్లాలో పీవీటీజీ ఆవాసాలలో ఆధార్, కుల ధృవీకరణ పత్రం, జన్‌ధన్ ఖాతా సాచురేషన్ సాధించేందుకు కృషి చేస్తుందని తెలిపారు. ఈ ప్రత్యేక శిబిరాలు వివిధ ప్రభుత్వ కార్యక్రమాలు పథకాల కోసం లబ్దిదారుల నమోదును సులభతరం చేస్తాయని పేర్కొన్నారు. పీవీటీజీ ప్రజలకు కూడా ఆయుష్మాన్ భారత్ కార్డులు, కిసాన్ క్రెడిట్ కార్డులు అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రత్యేక శిబిరాల ద్వారా నిరుపేదలకు జన్‌ధన్ బ్యాంకు ఖాతాలు తెరిపించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 15న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ వ్యాప్తంగా ప్రారంభించనున్న జన్‌మన్ పథకాన్ని వినియోగించుకోవాలని, పీవీటీజీ నివాసాలకు గ్యాస్ కనెక్షన్లు, ఆధార్ కార్డులు, ఇండ్లు, అందించడమే ఈ పథకం లక్ష్యమని, ఆయుష్మాన్ భారత్ కార్డులు, సికిల్‌సెల్ అనీమియా పరీక్షలు, విద్యుత్ కనెక్షన్, స్థిరమైన జీవనోపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సుధీర్, డీటీడబ్ల్యూఓ అంబాజి, డీఆర్వో లోకేష్, ఎంపీడీఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నూతన ఎమ్మెల్యేలకు సన్మానం

నవతెలంగాణ-నార్నూర్

బోథ్, ఖానాపూర్ నియోజకవర్గం నుంచి నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేలు జాదవ్ అనిల్, వెడ్మాబొజ్జు పటేల్‌ను మండల నాయకులు శాలువాతో సన్మానించారు. గెలిచిన తరువాత తొలిసారి మండలానికి వచ్చిన సందర్భంగా గురువారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్, పార్టీ నాయకులు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ప్రజలు సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో పీఏసీఎస్ ఇన్‌చార్జి చైర్మెన్ సురేష్ అడే, ఉప సర్పంచ్ మహేందర్, నాయకులు కొలట్కర్ పరమేశ్వర్, దుర్గం శేఖర్, పీసా కోఆర్డినేటర్ సికందర్, మాజీ ఉప సర్పంచ్ దాదేఆలీ, దళిత రత్న నర్సింగ్‌మోరే, మాజీ జెడ్పీటీసీలు పుష్కర్ రూపవతి జ్ఞానోబా, హేమలత బ్రిజ్లాల్, కొర్రల మహేందర్, దుర్గే మహేందర్, నేరడిగొండ ఎంపీపీ సజన్, గుడిహత్నూర్ సర్పంచ్ రమేష్, ఎంపీటీసీ కళావతి ఉత్తం, సుభాష్ రాథోడ్, బాబా ఖాన్, ఖాసీం, మహమ్మద్, కరీం ఖాన్ ఉన్నారు.

టీయూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే హరీష్



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) 2024 క్యాలెండర్, డైరీలను ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ఆవిష్కరించారు. గురువారం ఎమ్మెల్యే నివాసంలో సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చేతుల మీదుగా క్యాలెండర్, డైరీని ఆవిష్కరింపజేశారు. అనంతరం జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమార్‌తో పాటూ పలువురు ఉపాధ్యాయ సమస్యలపై ఎమ్మెల్యేకు వివరించారు. సీపీఎస్ రద్దు, 317 జీఓతో జిల్లాలోని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు తక్కువ అవుతున్నాయని తెలిపారు. ఉపాధ్యాయ సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావించాలని ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం దిశగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు భాను ప్రకాష్, నాగేశ్వరరావు, శ్యాంసుందర్, అనీష్ హమెద్, కృష్ణచంద్, భానోత్ ప్రకాష్, లక్ష్మీనారాయణ, లక్ష్మయ్య కిరణ్, భగవాన్, సుధాకర్, జిత్తు నాయక్, శంకర్ పాల్గొన్నారు.

వినియగదారులు కుల ధృవీకరణ అందజేయాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారులు తమ కుల ధృవీకరణ పత్రాన్ని విద్యుత్ శాఖ కార్యాలయంలో అందజేయాలని ఏఈ కమలాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ మీటరు ఎవరి పేరిట ఉందో వారి కుల ధృవీకరణ పత్రాన్ని, బిల్లును విద్యుత్ సిబ్బందికి కానీ కార్యాలయంలో కానీ అందజేయాలని సూచించారు.

విద్యార్థులకు క్రీడా సామాగ్రి పంపిణీ

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని ఆరెగూడ జిల్లా పరిషత్ మాధ్యమిక పాఠశాలలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ సహకారంతో విద్యార్థులకు క్రీడా సామాగ్రిని పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఆయా పోటీల్లో రాణించలనే ఉద్దేశ్యంతో క్రీడ సామాగ్రిని పంపిణీ చేశామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్ శ్రావణి, డిప్యూటీ ప్లాంటేషన్ మేనేజర్ దుర్గం రాకేష్, స్కూల్ హెచ్ఎం పి.చంద్రశేఖర్, శారద, అనిత, మంజుల, రవి శంకర్, రమేష్, రాజేశం పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

నవతెలంగాణ-కౌటాల

మండల కేంద్రానికి చెందిన రాథోడ్ కిషన్ అనే వ్యక్తి తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. బాధితుడు సీఈఐఆర్ పోర్టల్‌లో మీసేవాలో ఫిర్యాదు చేసి సంబంధిత కాపీలను కౌటాల ఎస్సైకి అందించారు. పోర్టల్ ద్వారా పోయిన ఫోన్‌ను గుర్తించి గురువారం బాధితుడికి అప్పగించారు. పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను వెతికి ఇచ్చినందుకు బాధితుడు ఎస్సైకి ధన్యవాదాలు తెలిపారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి 6 నుండి 10వ తరగతిలో ప్రవేశం కోసం ఆన్‌లైన్లఓ దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తులు ఫిబ్రవరి 22వ తేదీలోగా ఆన్‌లైన్‌లో చేసుకోవాలన్నారు. 6వ తరగతిలో 100 సీట్లకు, 7 నుండి 10వ తరగతుల్లో ఖాళీ సీట్లకు ఏప్రిల్ 7న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. తెలంగాణఎంఎస్.సీజీజీ.జీఓవీ.ఇన్ వెబ్ సైట్ వినియోగించాలని పేర్కొన్నారు. సీట్ల కేటాయింపులో ఆసిఫాబాద్ స్థానికులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు.

22న విద్యాసంస్థలకు సెలవు ప్రకటించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈనెల 22న రామమందిర ప్రాణప్రతిష్ట సందర్భంగా జిల్లాలో ఆరోజు సెలవును ప్రకటించాలని సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి కోరారు. గురువారం కలెక్టర్ రాహుల్ రాజ్, ఎమ్మెల్యే పాయల శంకర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ప్రాణ ప్రతిష్ట రోజున ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థలకు సెలవు ప్రకటించేలా చూడాలని కోరారు. అదే విధంగా వివేకానంద జయంతికి హాజరు కావాలని కోరుతూ పట్టణ యువజన సంఘాల నాయకులు కలెక్టర్‌కు ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి మాట్లాడుతూ జనవరి 22న రామ మందిర ప్రాణప్రతిష్టపకు ప్రపంచ దేశాలు భారతదేశం వైపు చూస్తున్నాయన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సూచించిన మేరకు ప్రతి ఒక్క హిందువు అదే రోజు తమ ఇండ్లలో దీపాలు వెలిగించి, పూజలు చేయాలని కోరారు. ఆలయాల్లో అర్చనలు, హోమాది కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. అదేరోజు పిల్లలకు సెలవు ఇవ్వాలని కలెక్టర్‌ను కోరడం జరిగిందని, ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు ఉన్నారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని రిమ్స్ సబ్ స్టేషన్‌లో మరమ్మత్తుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 13న శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఓల్డ్ హౌసింగ్ బోర్డు కాలని, టీచర్స్ కాలనీ, కలెక్టర్‌చౌక్, సంజయ్‌నగర్, సప్తగిరి కాలని అలాగే రిమ్స్ హాస్పిటల్ ఏరియాలలో విద్యుత్ సరఫరలో అంతరాయం ఉంటుందన్నారు. ఈ అంతరాయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

వివేకానంద జయంతికి అధికారులకు ఆహ్వానం

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

జాతీయ యువజనోత్సవం సందర్భంగా ఈనెల 12న ఆదిలాబాద్‌లో శుక్రవారం నిర్వహించే స్వామి వివేకానంద జయంతికి రావాలంటూ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్‌లు కుష్బు గుప్త, శ్యామల దేవి, ఆర్డీఓ స్రవంతిలకు యువజన సంఘాల సమితి సభ్యులు కోరారు. ఈ విషయమై గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్, అదనపు కలెక్టర్‌లను కలిసి విన్నవించారు. కార్యక్రమంలో సమితి నాయకులు బాలశంకర్ కృష్ణ, ఉరే గణేష్, అర్బాత్ ఖాన్, గణేష్ వర్మ, రవికుమార్, హేమంత్ పాల్గొన్నారు.